# వీరులూ - వారసులూ

కోటిలింగం కావిడి పెట్టె మీదున్న ఏకుల బుట్టలు దించి, పైకండువాతో పెట్టెమీద పరచుకొన్న దుమ్ము దులిపి, లోపలినుండి మడతలైనా మాయని పెద్దాపురం పట్టుత్తరీయం తీశాడు. ఆ జరీ అంచుల పట్టుత్తరీయం - యిప్పటిది గాదు. పెళ్ళినాటిది. పెళ్ళిమాత్రం యిప్పటిమాటా? పదహారేళ్ళయింది.

ఎప్పుడో వేసిన కలరావుండల వాసన గుమ్మునకొట్టి కోటిలింగం మళ్ళీ పెట్టె మూత వేశాడు. అందులో యీ పట్టుత్తరీయం ఒక్కటే విలువైన వస్తువు.

తాయారమ్మ వచ్చి "ఎక్కడికి?" అని ప్రశ్నించింది.

కోటిలింగం భార్యముఖం చూడకుండానే - "అదుగో, ఆ మాటే అడగొద్దన్నా నిన్ను. అడక్కపోతే నేను చెప్పనూ? అడుగులోనే హంసపాదు బెడతావు. తాలూకా పోతున్నాం - మన పేటవాళ్ళమంతా కలిసి. తాసిల్దారు దగ్గిరికి. సరేనా?" అని పుల్లవిరుపు సమాధానం యిచ్చాడు. అతని కళ్ళు లోతుగా వున్నాయి. అంత పొద్దుకగూడా ముఖం చిరుచెమటలు పోసి వున్నది.

"పిల్లది తుమ్మింది. కొంచెం తాళిపో. గంజి కాస్తున్నా, కాస్త తాగి పోతావా?"

కోటిలింగం మాట్లాడక కావిడి పెట్టెమీద కూచొన్నాడు. మరుక్షణంలోనే బయటనుండి వచ్చిన నూలు సత్యం కేక విని తుర్రున లేచిపోయాడు.

చేతిలో ఆవిర్లు వస్తున్న గంజిగిన్నె పట్టుకొని గడపలోనే ఆగిపోయింది తాయారమ్మ.

ఊరింకా నిద్రలేవలేదు. పనుల్లేని కాలమని తాపీగా విశ్రాంతి తీసుకొంటున్నది. సూర్యోదయమై అరగంటకూడా దాటలేదు. మిగతా వాండ్లను పిలుస్తూ నూలు సత్యం వినాయకుడి సందులోకి వెళ్ళి యింకా రాలేదు.

ఈ సూర్యోదయానికి అర్థమేమిటి? నిత్యమూ, ఎల్లెడలా, ఖండ ఖండాంతరాల్లో నదీనదాల్లో, లోయల్లో, తోపుల్లో, కొండల్లో ఉదయించే యీ తూర్పు

కిరణాలు యివ్వాళ యింత ఎఱ్ఱగా ఎందుకున్నాయి? ప్రతి చోటా, ప్రతి దినమూ, ప్రతి జీవి అనుభవించే ఉదయమూ, అస్తమయమూ - ఊరికంతకూ ఒక సామాన్య సంఘటనే గదా? కాని తనకు? కోటిలింగానికి? ముగ్గురు బిడ్డల తండ్రి కోటిలింగానికి? మాస్టర్ వీవర్ అవుతానని పెళ్ళినాటినుండీ ఆశల రహస్యపు కలల మెత్తటి పూసెజ్జలమీద నిద్రించిన చేనేత పనివాడు కోటిలింగానికి? చేనేత సంఘం రాకముందు "సాలెవాడు", మొదటి దశలో ''పద్మశాలి", యిప్పుడు అందరు మోతుబరి రైతులవలెనే ఒక వ్యక్తియైన "కోటిలింగానికి" యిది సామాన్య సంఘట నెట్లా అవుతుంది? పాడుబడి మూలనుండి దిక్కులేక, నోరు లేక, నిశ్శబ్ద దేవతలాగా దుఃఖించే తన మగ్గం దృశ్యం గాదా యీ బాల సూర్యుడి లేతకిరణ పుంజాలు? వారం రోజుల నుండీ బియ్యపు మెతు కెరగని తన భార్య కుంకుమబొట్టు ముఖంమీద అదృశ్యమై, దృశ్యమై, దోబూచులాడే దైన్యదేవతగాదా - యీ ఉదయ తేజస్సు మేల్కొలుపు? తరతరాలనుండి నిలిచిన మగ్గపుటింట్లో పుట్టి, నిండు గుడ్డకు నోచుకోని తన ముగ్గురు బిడ్డలకు యీ భానుడి వుదయం కొత్త వగటి దుస్స్వప్నంవలె నిలుస్తుందని తనకు తెలియదా? తెలుసు, తెలుసు, కాలం మారింది. సూర్యుడు మారాడు, తను నేసిన ఖద్దరు పంచలు మారినవి, తన రంగురంగుల చీరెల జిగి నగిషీలు మారినవి; జరీలు. కడుపులో జ్వాలలు, మానవులూ, మనసులో ఆశలూ, కండలూ, కంటిమీది కునుకూ - అన్నీ మారినవి. కాని, యీ ఉదయం నిలిచేవుంది. ఇక అస్తమయమూ రాబోతుంది. యుగయుగాల ఆకలి నెత్తురు గుర్తులివి. ఉదయమూ, అస్తమయమూ - మానవుల ఆకలికి కొలనూనాలివి. నూలు సత్యం కేకలు విన పడుతున్నవే గాని యింకా తిరిగిరాలేదు.

మూడుసార్లు కాంగ్రెసులో జైలుజీవితం అనుభవించి వచ్చిన శ్రీరాములు గారు చెఱువుకట్ట దిగుతూ, కోటిలింగాన్ని చూసి దగ్గరికి వచ్చాడు. శ్రీరాములు గారి ఆశీర్వచన బలంవల్లనే, యీ బక్క రాజకీయ బాధితుడి ప్రోద్బలంవల్లనే- చేనేత సంఘం మెమోరాండం తయారయింది. ముఠా రాజకీయ వేత్తల ప్రాపుకు, మోతుబరి రైతు మిల్లుదార్ల చూపుకూ కొరగాని శ్రీరాములుగారి నిత్య దరిద్ర నారాయణ వాతావరణపు చావులేని ఆశనుండే యీ చేనేత కార్మికుల ఆకలి యాత్ర తాసీల్దారును చూడబోతున్నది.

. . . . . . . . . .

''నమస్కారమండీ, పంతులుగారూ!"

"శుభస్య శీఘ్రం" అని శ్రీరాములుగారు నవ్వాడు.

"సత్యంకోసం చూస్తున్నాను. వాళ్ళందర్నీ పిలవబోయాడు.''

"సత్యం ఎదురవుతుంది. సత్యం జయించి తీరుతుంది కోటిలింగం!''

''పెద్దలు, తమరెప్పుడూ యిట్లాగే అంటారు. మీ ఆశీర్వచనం.''

"ఇదిగో - మరిచిపొయ్యేరు గనక. బ్లాకు మార్కెటు చేస్తున్న మాష్టరు వీవర్ల సంగతి గూడా చెప్పండి. మళ్ళీ నిన్న పేపర్లో 40 వ నెంబరుకు గూడ ధర పెరిగిందని చదివాను. నేనిచ్చిన లిష్టున్నదా పోయిందా?''

''ఎంతమాటన్నారు? పోవటమా?''

పోదుపోదు; ఆకలి వున్నంతవరకూ, ఆశలు మిగిలినంతవరకూ పోదు.

నలభై ఏళ్ళకే ముగ్గుబుట్టయిన తలతో నడిచిపోతున్న యీ సన్నని దేశ భక్తుడు అసత్యంలో సత్యాన్ని, హింసలో అహింసను చూడగలడు. అన్యాయంలోనుంచే న్యాయం ఉద్భవిస్తుందంటాడు.

సత్యం ఎదురుగాదా? ఈ నాటికి తన ఆకలి సత్యం. ఈ క్షణాన తన ఆశలు సత్యం. ఈ ఘడియన ఉదయం సత్యం. ఏమో - ఎవరు చూశారు? ఆయనకు, ఎన్నడూ అబద్ధమాడని ఆయనకు, అయనకు తెలీదా? తన క్షుద్బాధలో నుండి రామరాజ్యమే రాగూడదా? ఎందుకు రాగూడదు?

* * *

చెన్న కేశవస్వామి దేవాలయపు అరుగులమీద అప్పటికప్పుడే సాంబయ్య హోటల్లో తిని, త్రాగి, త్రేన్చివచ్చిన పెద్దమనుషులు చేరారు. గుడి మంటపంవెనక పాత గదుల్లో వుంటున్న రామానుజయ్య గూడా తంబురామీద పాటలు పాడి ముగించి, కాషాయ లుంగీ చుట్టుకొని బయటకు వచ్చాడు. రామానుజయ్య కోటిలింగం గురువు.

"వెళ్ళొస్తాం తాతా!" అని ముందుకొచ్చి నిలబడ్డాడు కోటిలింగం.

సగంబోసినోరు విప్పి కన్నడపు తెలుగులో ''నేనూ భద్రాద్రి బోతున్నా గదా?'' అన్నాడు రామానుజయ్య.

''మేము రేపే వస్తాం. నువ్వెళ్ళేది వచ్చేవారమేగా?''

''కాదులే నడిచివెళ్దామని అనుకొన్నా. నువ్వొంటే రేపే బయలుదేరుదును. నువ్వొచ్చిందాకా వుంటానులే.''

"మరి వెళ్ళిరమ్మంటావా?"

"సద్గురు కటాక్షం"

అందరికన్నా వెనకనడిచాడు గుంపులో కోటిలింగం. సత్యం అడిగాడు - "పెళ్ళికొడుకు దిరుసు బనాయించినావే?" అని నవ్వుతూ. ఆ మాట నిజమే. కోటిలింగం యీ పట్టుత్తరీయం పట్టుమని పదిసార్లు గూడా వేసుకోలేదు. తన పెళ్ళికి, తర్వాత సత్యం ప్రదానానికి, మళ్ళీ చేనేతసంఘం మొదటి మీటింగునాడు, తిరిగి యిప్పుడు. ఈ కండువా చూస్తే కోటిలింగానికి ఆకలి పోతుంది; ఆశలు పుట్టుకొస్తయ్. మాష్టరు వీవర్ భుజంమీద వుండవలసిన వుత్తరీయం - చేనేత కార్మికుడి చిరిగిన బనీను వీపునుకప్పుతున్నది. ఆకలినుండి ఆశకు.

# 2

తాలూకా యాత్రకు కొండంత ఆశతో వెళ్ళారు అంతా. ముఖ్యంగా కోటిలింగం. ఆకలియాత్ర నడకమీదనే సాగింది. దాదాపు నలభై మైళ్ళు. దారిలో కోటిలింగం ఎవరితోనూ మాట్లాడలేదు. అందరూ చద్దిమూటలు తెచ్చుకొని, మధ్యలో మఠం బావి దగ్గరో, పుట్టచెట్టు కిందనో తినేశారు. కొందరు జెండాలు పట్టుకొన్నారు. సత్యం వంటి కుర్రవాళ్లు పాటలు పాడారు. ఆకలి వుండదనీ, ఆహారం తర్వాత గుడ్డ ముఖ్యమనీ, గుడ్డనేసేవాడికి తిండి పెట్టమనీ, మంచిరోజులొస్తాయనీ, మగ్గాలు మారుపలుకుతాయని యీ మానవుల పాటలు! కోటిలింగం శ్రద్ధగా విన్నాడుగాని వాళ్ళతో గొంతు కలపలేదు. మూగనోము పట్టిన గృహస్థువలె నడిచాడు. దాహమైనచోట నీళ్లు తాగాడు. అతని హృదయంలో రామానుజయ్య మెదిలాడు. అతని మనస్సులో శ్రీరాములుగారు కదిలాడు. అతని తలపుల్లో తాయారమ్మ తారట్లాడింది. పొద్దునే ఎందుకు తిట్టాడు? పిచ్చి తాయారు! ఏమన్నదని?

పరిణతిచెందిన ఆశ ఆకారం ధరించినట్లున్నాడు కోటిలింగం. ఎవరితోనో మాట్లాడి యీ దివ్యస్వరూపాన్ని చెడగొట్టడమా? ఒక్క మాటతో, వృథా నవ్వుతో, ఒక్క నాలిక కదలికతో రామానుజయ్య సద్గురు కటాక్షం, శ్రీరాములుగారి సత్యస్వరూపసాక్షాత్కారం, తనఊహల రామరాజ్యం మాయమై,

తిరిగి కనబడక, ఈ అనంతయాత్రవలెనే తిప్పలు పెట్టి, వెతలలో, చీకటిలో, ఆకలిలో మునిగిపోతేనో? ఈ మౌనం, యీ తపస్సు యీ ధ్యానమహిమ వీళ్ళకు తెలియదు. తను వీరిలో చేరలేడు. వాళ్ళ ఆకలిని తను పంచుకోగలడు; కాని తన వేదాంతాన్ని వీళ్ళో?

తాలూకా వస్తుంది; గఋవు యిసుక; దానితో తహశీలుదారు; తమ మెమోరాండం; కోర్కెలు; హక్కులు; విన్నపాలు. మళ్ళీ తన నూలుకట్ట పాత ధరలకు దొరుకుతుంది. బజారులో తన చీరె ధరలు తిరిగి నిలుస్తవి. తిరిగి బియ్యం కొనవచ్చు. మళ్ళీ బ్లాకు మార్కెటీర్ల యింటిచుట్టూ తిరిగి కాళ్ళు పట్టు కొనకుండానే తనకు మాష్టర్ పీవరు పద్దులిస్తాడు. తన మగ్గం తాకట్టు పోతుంది. తన మగ్గం మారువలికి మాట్లాడి, పాట పాడి, పొట్ట నింపుతుంది. పడుగులు చేసేందుకు, పేకలు పోసేందుకు తను మాణిక్యాన్ని, చెంగమ్మను మళ్ళీ పిలిచి పని చూపిస్తాడు. దేవుడు మేలుచేస్తే, వచ్చేయేడు తను గూడా భద్రాద్రి యాత్ర చెయ్యబోతాడు, రామానుజయ్యతోపాటు. పెద్దవాడికి వడుగు పోగువేసి, కందికట్ల శ్రీరాములు పంతులుగారికి, (ఆ బీదబ్రాహ్మడ్ని పిలిచి) తాంబూలం యిప్పించి, పిల్లవాడిచేత పంచలచాపు గూడా పెట్టించాలి.

కళ్ళు తెరిచాడా - యీ స్వప్నం నశించవచ్చు. నోరు కదిపాడా - యీ స్వర్లోకం నుంచి భూలోకానికి పతనమైపోవచ్చు. తను చూడడు. తను మాటాడడు. తనది ఆకలి. తనది ఆశ. తనది స్వప్నం.

తాసీల్దారు రెండుగంటలకై బంగాళానుండి బయటకు రాలేదు. యాత్రికు లందరూ జీడిమామిడి చెట్లక్రింద బైఠాయించారు. ఎండ మలమల మాడుతున్నది. ఇసుకనేల కొలిమిలో ఇనుమువలె కాలిపోతున్నది. కాని, తాసీల్దార్ రాలేదు.

యన్. జి. వోల సమ్మెలో తమకు జీతం ఎక్కువ కావాలని, తమ బిడ్డల చదువుకు రక్షణ కావాలని, తమకు ఉచితవైద్య సౌకర్యాలు అమరాలని కోరిన యీ తాసిల్దారును - యీ ఆకలియాత్ర ఎందుకు కదల్చలేదో! నాలుగు డబ్బులు కూడబెట్టుకొని గ్రామస్థుల సౌఖ్యాన్ని దగ్ధంచేసే ముఠావాది రైతు మోతుబరివలె, నాలుగు మిడిమిడి ఇంగ్లీషు ముక్కలు చదివి చేయవలసిన తన ప్రజా సేవను మరిచిపోయే యీ చిన్న అధికారి గూడా యీ దేశంలో వైవాంశ సంభూతుడే. గ్రామోద్యోగులు, తనవలె, ఎక్కువ జీతం కావాలని కోరినప్పుడు, వాళ్ళందరూ

కుట్రదారులని రిపోర్టు చేసిన అధికారే చివరకు సత్యం యింకా నలుగురు చదువుకొన్నవాళ్ళు ముందుకువచ్చి ఇచ్చిన మెమోరాండాన్ని చూదాడు. నిశ్శబ్దంగా నుంచొని తన కడుపులోని పేగుల దీనారావాన్ని నిర్లక్ష్యం చేసి, తను మనిషిగాక మాత్రైనట్లు నిలబడి కోటిలింగం యీ వర్తమాన దృశ్యాన్ని చూడలేదు. సత్యం ధైర్యంగా గబగబా తమ కోర్కెల్ని వల్లించాడు. ఫలాని ఫలానివాళ్ళు నూలులో బ్లాకు మార్కెటు చేస్తున్నారని, వచ్చి విచారించమని అంతమంది ముందూ కోరాడు. దేశనాయకులు పేటకువచ్చిన బ్రిటిష్‌రోజుల్లో అంతమంది పోలీసుల ముందు తను వడికిన ఖద్దరు నూలుదండల్ని వాళ్ళ మెడల్లో గర్వంతో, ధైర్యంతో, సంతోషంతో వేసిన ఆ కోటిలింగమే తన మౌనవ్రతాన్ని తనే భంగపరచలేక నిస్సహాయుడై అక్కడ యీనాడు ఆ క్షణంలో గూడా నిలిచాడు. కొందరు నినాదాలు చేశారు. కొందరు తమ సంగతులు గూడా వినిపించటానికి ముందుకు దూకారు. కొందరు పోలీసులవంక చూస్తూ నిల్చుండిపోయారు.

తాసీల్దారు అంతా విన్నాడు. "మీ కాయితం పైకి పంపుతా'' నన్నాడు. గంజికేంద్రం సంగతి గూడా రాస్తానన్నాడు. తన చేతిలో ఏమీ లేదన్నాడు. ''ఏమీ లేదా?'' అన్న ప్రశ్న బరువై కోటిలింగం మనస్సులో పదిసార్లు మారుమ్రోగింది. కాని, కోటిలింగం కదలలేదు తాసీల్దారు పెదిమలవంకచూసి ప్రార్థనాభావంతో కళ్ళు మూసుకొన్నాడు.

## 3

''తపస్సు ముగిసింది. ఇక దేవుని వరంకోసం వేచివున్నా''నన్నట్లయింది అకలియాత్ర ముగింపు. బాపట్లనుంచి తిరిగివస్తూనే కోటిలింగం రామానుజయ్య మఠం ముందు ఆగిపోయాడు. అతను ఆకలి సంగతే మరచిపోయాడు. సత్యం బలవంతంమీద నిన్న తిన్న యిడ్లెన్ను, కాఫీమాత్రమే రెండురోజుల ఆహారం.

రామానుజయ్య ఆముదపు ప్రమిదె వెలిగించి - "నా ప్రయాణం ఆగిపోయింది. వచ్చేవారమే వెళ్తాను. నడిచి కాదు రైలు బండి" అన్నాడు కోటిలింగంవంక తిరిగి. రామానుజయ్య ఎప్పుడూ కోటిలింగం దారిద్ర్యస్థితి గురించి ప్రస్తావించడు, ప్రస్తావించలేదు.

వడదెబ్బకు, ఎర్రదుమ్ముకు, నిన్నటినుండి ఉపాసిస్తున్న మౌనముద్రకు జేగురుబడి వింతవెలుగుతో కప్పుకొన్న తన ముఖాన్ని, అక్కడి ముంతనీళ్ళతో

కడుగుకొని, కోటిలింగం నడుముకు కట్టుకొన్న కొల్లాయిగుడ్డతో తుడుచు కుంటూ-

"అదేమిటి తాతా! నేను రాగానే వెళ్ళుతానంటివి?" అని రామానుజయ్య కళ్ళల్లోకి ఆశ్చర్యంగా చూశాడు.

తాత బుర్రమీద ముసుగు తొలగించుకొని, ఒక్క-క్షణం మాట్లాడకుండా శిష్యుడివంకనే కళ్ళు నిలిపి అవలించినాడు. ఆ ఏకక్షణపు నిశ్శబ్దం ఆది కాలాల నుండి, అనాది యుగాలనుండి అనంతమై, అఖండమై, నిర్విరామమై సాగిన మహా మౌనముద్రగా, భయంకర వేదనతో, రహస్యగర్భితమై కోటిలింగానికి కనబడ్డది.

"తా....తా!" అన్న అతని పెదిమల వణకుకు ప్రమిదె కొండెక్కినది.

ఎవరిముందు తానుకూర్చున్నది? ఎవరీ తాత? కన్నడపుయాసతో తెలుగు మాట్లాడే యీ రామానుజయ్య ఎవరు? యోగి వేమన అవతారమా? వీరబ్రహ్మం గారి కాలజ్ఞాన దివ్యదీపికా? కబీర్ దాసుడా? సిద్ధుడా? జీవసమాధి పొందిన మహా యోగిపుంగవుడా? ఎవరీ రహస్యవాది? ఏమిటీ అది అంతూలేని మౌనముద్ర? కోటిలింగం అప్రయత్నంగా చేతులు జోడించినాడు. అతని ఫాలభాగంపై ముచ్చెమటలు పోసినవి. ఆ చీకటిలోనే ఆరిపోయిన ప్రమిదెనుండి, కొడికట్టిన వత్తినుండి రహస్యవాసన వచ్చినది. మెల్లగా భయంతో ఆ అవ్యక్త తమస్సులో దానినే ఆఘ్రాణించివేసివున్నాడు కోటిలింగం గుత్తికొండబిలంలో యాత్రికుల కదృశ్యుడై, కారెమపూడి నాటినుండి తపస్సాచరిస్తున్న బ్రహ్మనాయుడి కథ కోటిలింగానికి స్మృతికి వచ్చింది. తనా తపోధనుడిముందేనా వున్నది? కోటిలింగం గడ్డిపోచవలే వణికిపోయినాడు.

చీకటిని చీల్చుకొని ఎట్టకేలకు శబ్దం వినవచ్చింది. గదంతా యీ శబ్దం తోనే వెలిగినట్లయింది.

"ఎందుకా భయం కోటిలింగాలు? నా అవసరం నీకింకా ఒక వారమే వున్నది. ఆ తరువాత నీవే నేను; నేనే నీవు నీ అవసరమూ యీ వారందినాలే. ఆ తరవాత నేను లేను."

కోటిలింగం యీ అవ్యక్త పదాలను సమన్వయించుకో ప్రయత్నించలేదు. ఆ చీకటినుండి బయటపడితే చాలుననుకొన్నాడు. అతడు తిరిగి మాట్లాడనూ

లేదు. ప్రమిదె తిరిగి వెలిగింది అకలి దాసుడు యింటివేపు దారి తీశాడు రామానుజయ్య తాత తాంబూరా తిరిగి మోగినది.

తాయారమ్మ పొంతకుండలో వేణ్ణీళ్ళు తోడింది. నీళ్ళు పోసుకొన్నాక గంజి గిన్నెలో ఉప్పు కలిపి ముందు పెట్టింది.

"పిల్లల కందరికీ జ్వరం."

పాత పీట దిగి మగ్గం గదిలోకి డిగ్గున నడిచి వెళ్ళాడు కోటిలింగం. మగ్గంగుంటమీది గట్టుపైన కింద నీళ్ళు, పైన కిరసనాయిలుతో వెలుగుతున్న మసిబుడ్డి కాంతిలో తన బిడ్డలమీద చెయ్యివేసి చూచాడు.

"నువ్వువాళ్ళకైనా చెప్పకుండాపోతివి. దిగులుపడ్డారు" అంటూ తనుగూడా ఆ గదిలోకే వచ్చింది తాయారమ్మ. ఆమె మాట వినిపించుకోకుండానే పిల్లల పక్కనే కోటిలింగం పడుకున్నాడు. నిద్రపోయాడో లేదో ఎవరికీ తెలియదు.

# 4

తెల్లవారు ఝామున శ్రీరాములుగారి కంఠస్వరం విని కోటిలింగం చెరువుకట్టమీదకు పోయాడు మసక చీకట్లో శ్రీరాములు గారి తెల్ల ఖద్దరు పాత ఉత్తరీయం అతని కళ్ళకు మిరుమిట్లుగొలుపుతూ కనిపించింది. శ్రీరాములు గారి సాన్నిధ్యంలో పరమశాంతి అనుభవిస్తూ నిల్చుండిపోయాడు కోటిలింగం.

శ్రీరాములుగారు అకస్మాత్తుగా అతని వీపు తట్టి - "భయంలేదు. తాసీల్దారు కదలకపోతే రేపుపోయి నేను కలెక్టరును చూస్తాను. నూలు కంట్రోలు ధరలకు యిప్పించమని గొడవ చేసెయ్యనూ!" అన్నాడు.

"ఇదుగో, యింకోమాట కోటిలింగం! నువ్వుమాత్రం స్వాతంత్ర్య సమరంలో వీరుడివి గాదూ? వడకునూలు ఖద్దరు నేసి స్వదేశీ ఉద్యమాన్ని గట్టెక్కించిన వీరుడివి. స్వరాజ్యం వచ్చింది. దానికి నువ్వుగూడా వారసుడివే."

తనకు శ్రీరాములుగారు రాజకీయైహిక విషయాలలో గురువు. రామానుజయ్య తాత అధ్యాత్మికాముష్మిక విషయాల్లో గురువు. తనకు శాంతికేమి తక్కువ? తనుమాత్రం వీరుడు గాడా? తనుగూడా వారసుడుగాడా? వసంతంలో చెట్లు పాతఆకులు విదిల్చి, కొత్త చిగుళ్ళు తొడిగినట్లు, రాత్రి తను పొందిన దుర్భరమైన అశాంతి ఒక్కసారిగా వదలించుకొని బాలార్కుడివలె నిర్మలుడై

అతడు శాంతమూర్తిగా మారిపోయాడు. కరువు, ఆకలి, పిల్లల జ్వరం, రాత్రి రామానుజయ్య మాటల్లోని గూఢార్థం, తన నీగతికి తెచ్చిన బ్లాకుమార్కెటీర్ల దురాశ - అన్నీ మరిచిపోయ్యాడు ఒక్క క్షణం. తను వీరుడు, తను వారసుడు; క్షుద్రుడు గాడు.

"ఏమిటి మాట్లాడవేమిటి? యిదుగో, యీ వ్యాపారం యిక గిట్టదంటావా? నేను రాజకీయ బాధితుణ్ణిగా భూమికి దరఖాస్తు పెట్టాను. అదిరాగానే నాతోపాటు వ్యవసాయం చెయ్. నీ భార్యబిడ్డలతో బదకలేక పోలేవు."

ఈ మాటు శ్రీరాములుగారివేపు నీళ్లు నిండిడ నేత్రాల్తో చూశాడు. బరువూ, బ్రతుకూ, కృతజ్ఞతా, శాంతీ, అశాంతీ నిండుగా నిండి తొణికిపోయిన చూపు అది తనకేగాదు యీ వ్యాపారం గిట్టనిది- తనవంటి వాళ్ళు వందలు, వేలు- బహుశా దేశమంతటా చూస్తే లక్షలు. మరి వాళ్ళందరూ? తన అదృష్టం కొద్దీ యీ దయార్ద్ర హృదయులు శ్రీరాములుగారు, రామానుజయ్యతాత తనకి శాంతి ప్రసాదిస్తున్నారు. మగ్గమున్న యిల్లల్లా ఆకలికి ఆలయమే. శ్రీరాములు గారికి నమస్కారం చేసి, జీవన సమరానికి కోటిలింగం తరలిపోయాడు. మగ్గమున్న గదిలో ఆకలీవుంది - మరి!

* * *

"నీ సొమ్మేమైనా నాకాడ దాచిపెట్టావా అంటా? లీడరుబోయినట్టు కనబడకుండానే పోతివి. నువ్వెక్కడ? బ్లాకు జేస్తున్నానని తాసీల్దారుకు రిపోర్టులు జేశావుగా? మరి తాసీల్దారే యిస్తాడుగా, తెచ్చుకోకపోయినావ్ నూలుకట్టలు? కట్టు. పాతబాకీ కట్టి మరీ మాట్లాడు. ఏ మొగం బెట్టుకొని అడగొచ్చావ్ అప్పు? అప్పులేదు. గివ్పూ లేదు. పో. ఆ సత్యంతోనే జెప్పుకో. నీ లీడర్లకాడనే జెప్పుకోవయ్యా! ఆ శ్రీరాములు పెదతాళ్లే నీకు బువ్వ. తాడు తెగిన యాళ్లంటోయ్ నన్ను బెదిరించేది! కట్టు. పాతబాకీ కట్టి మరీ కదులు."

నిజమే తను షావుకారుకు బాకీ వున్న మాట నిజమే. కిందటినెల తిరిగి తిరిగి గతిలేక యిరవై నెంబరు నూలుపెట్టె యీషావుకారుపద్దే యిరవైరెండు రూపాయలకు కొన్నాడు. మాణిక్యమ్మ వచ్చి పేకలు పోసింది. చెంగమ్మ వచ్చి పడుగులు చేసింది. దిక్కులేని ఆ యిద్దరికీ నాలుగురోజులు తిండి కలిపించాను గదా అని తృప్తిపడ్డాడు. కాని, తీరా చీరె అమ్మితే పన్నెండు రూపాయలుగూడా

రాలేదు. తన ఇంటిల్లిపాదీ పది రోజులు కష్టపడ్డందుకు కూలిగూడా గిట్టలేదు. బ్లాకులో నూలుకొంటే మరి కూలి గిట్టమన్నా గిట్టదు; గంజి రమ్మన్నా రాదు. ముద్దర సుద్దిగా చేతికొచ్చిన పన్నెండు రూపాయలూ షావుకారు కిచ్చాడు. పోతే, పది రూపాయలు బాకీ తనని అమ్మినా పది రూపాయలు రావు ఆ క్షణాన.

షావుకారు లిట్లన్నీ తలవంచుకు విన్నాడు కోటిలింగం. వెనక బ్రిటిషు గవర్నర్లు, అడ్వైజర్లు కలెక్టర్లు వచ్చినప్పుడు తన యింటిముందు ఆర్చీల తోరణాలు కట్టి, స్వాగత పత్రాలు సమర్పించి, ఏ దివాన్ బహదూర్ బిరుదు కోసమో నానా తిప్పలు పడిన షావుకారుకు ఆనాడు ఊళ్ళో పరపతి లేదు. కాని, యీనాడు బళ్ళు ఓడలైనవి. ఓడలు బండ్లయినవి. ఇప్పుడు షావుకారు జెండాలు మార్చాడు; గుడ్డలు మార్చాడు. మరి యీ ఉజ్వల భవిష్యత్తుకు, యీ స్వప్న వర్తమానానికి తనూ, శ్రీరాములుగారూ వారసులా? లేక యీ రంగులు మార్చిన షావుకారా?

కోటిలింగానికి కోపం రాలేదు కాలజ్ఞానంలో ఒక తత్వం జ్ఞాపక మొచ్చింది. శ్రీరాములుగారు, రామానుజయ్య, సత్యం, తన భార్య, దిక్కులేని చెంగమ్మ స్మృతికి వచ్చారు ఎవరు వారసులు? దేనికి వారసులు? ఎవరు? ఎవరు?

ఆరోజల్లా కోటిలింగం రామానుజయ్యను చూడనేలేదు. నేరుగా యింటికి పోయి, మగ్గంగుంటలో దిగి గోడకు చేరబడి నడుము వాల్చాడు. "ఎవరు వారసులు? వారసు లెవరు?" తాయారమ్మ రెండుసార్లు వచ్చి చూచింది. కోటి లింగం కళ్ళు ఎఱ్ఱగా వుంటంచూచి మారు మాట్లాడక వెళ్ళిపోయింది. సాయం త్రానికి సత్యం వచ్చిపోయాడు; ఇంకో అరగంటలో ఒక తవ్వెడు బియ్యం కాయితాలబుట్టలో పోసి, తన ముసలి తండ్రి అమరయ్యచేత పంపించాడు.

''ఏమిరా కోటీ, అట్లా పడుకున్నావ్? లేలే - యివ్వాళగాకుంటే రేపు దొరుకుతది పని'' అని అమరయ్య గుంటలోకి వంగి చూచాడు

''అదిగాదే అమరయ్యా మామా! అసలు వారసు లెవరని? శ్రీరాములు గారా? షావుకారు రంగనాయకులా?'' ఈ ప్రశ్నవేసి కోటిలింగం, పిచ్చివాడిలా శూన్య దృక్కుల్తో అమరయ్యా ముఖంలోకి చూశాడు

"ఏడిశావ్! నీగ్గాదురా కోటీ చెప్పేది? లేచిరమ్మంటున్నా వినబడదురా? ధక్కా మొక్కీలు తినకుండా మా కాలాలన్నీ తెల్లారినయ్యంటావా? కష్టకాలం

వచ్చిందని చేతులు ముడుచుక్కూర్చుని ముక్కు మూసుకుంటే తిండి తొరుకుద్దంటరా?"

నాలుగు చీవాట్లువేసి అమరయ్య వెళ్ళాడు. తాయారమ్మ బుట్టలో బియ్యం చేటలోగూడా పొయ్యకుండానే, నిప్పురాజేసి గంజికుండ పైనబెట్టి బియ్యం పోసేసింది. బాగా చీకటిపడ్డది చెరువుకట్టమీద పెత్తనాలు చేస్తున్నవాళ్ళు గూడా యిళ్ళవేపు మళ్ళారు. అమావాస్య ఆకసంలో కడుపుదరిగే కనుసన్నల్లో చుక్కలు బిక్కుబిక్కు మంటున్నాయ్. కండక్టరు చేస్తున్న అల్లరితో గుంటూరు బస్సు - చివరిది అరుచుకుంటూపోయింది. దొమ్మరివాళ్ళయిళ్ళనుండి సాయంత్రం నుండీ వినవస్తున్న అల్లరి సర్దుకొంటున్నది.

"కోటిలింగాలూ" అని పిలుస్తూ రామానుజయ్య లోపలికి వచ్చాడు. "ఏమీ లేదులే. సాధులొచ్చారు. ఊరంతా పండుకొంటా వుండారు! ఇంత అన్నం బెట్టిస్తావని వచ్చాలే" అంటూ పిల్లల పక్కనే కూచున్నాడు.

తాయారమ్మగూడా అక్కడికే వచ్చింది. రామానుజయ్య కోరిక కొత్తది గాదు. ''బదికున్న రోజుల్లో'' వారాని కొక్కసారైనా రామానుజయ్య తాత సాధుల తాకిడి తగులుతూనే వుండేది. రోజులు మారి, గుమ్మంముందు కరువు కాపులు గాస్తున్నాక సాధువుల రాకగూడా అరుదైపోయింది.

తాయారమ్మ కల్పించుకొని తాతతో ఏమో చెప్పబోయింది. కోటిలింగం కళ్ళు భార్య పెదిమలవేపు ఒక్క అరక్షణం నిలిచి తిరిగి తాతవేపు తిరిగినవి. ఆ చూపుకు తాయారమ్మ తలవంచుకొన్నది.

''అన్నం వుడికిందా?'' అని పెళ్ళాన్ని అడిగాడు.

"గంజివారుస్తున్నా!"

"పంపించు తాతా సాధుల్ని. అయితే, యిద్దరికీ సరిపోతుందో లేదోనే?"

"దానికేమిల్లే. నాలుగు మెతుకులు నంజి, గుక్కెడు గంజి తాగితే సాదులకు తెల్లారిపోతుంది" అంటూ రామానుజయ్య లేచాడు. సాధులంటే సన్యాసులే గాని సంసారులు కాదుగా!

# 5

తాయారమ్మ మొగుడితో రెండు రోజులు మాటలాడటమే మానివేసింది.

మానివేయదా మరి? పిల్లల నోటిముందు తిండి సన్యాసులకిచ్చి మెదలక కూర్చున్న కోటిలింగం తనకు తనే సాటి మనిషైనప్పాడు. మూడవరోజున సత్యం యిచ్చిన అర్ధరూపాయితో హనుమయ్య కొట్లో పాత జొన్నలు తెచ్చి బిరుసుగంజివార్చి పొట్టలు నింపుకొని పడుకొన్నారు. ఆ రోజున ఊళ్ళో కొత్తగా బస్సులైన్లకు పర్మిట్లు సంపాదించిన చౌదరమ్మ కూతురు పెండ్లికి బస్తీ బ్యాండు మేళం వచ్చింది. పిల్లలు ముగ్గురూ పెళ్ళి వూరేగింపుతో తిరిగి తిరిగి రాత్రి పది వేసిం తర్వాత కొంప చేరారు. తాయారమ్మ వాళ్ళను పడుకోబెట్టి తనూ కొంగు పరుచుకొని నడుం వాల్చింది కోటిలింగం మగ్గంగుంట పక్కనే పిల్లలతోపాటు పడుకొన్నాడు.

అర్ధరాత్రివేళప్పుడు భార్య కలవరించి కేకలు పెట్టినప్పుడే అతనికి మెళకువ వచ్చింది

"తాయారూ....తాయారూ...."

తాయారమ్మ వణికిపోతూ లేచి కూచొన్నది. తన మంగళసూత్రం ఎవరో తెంపివేశారుట! తన ముఖాన బొట్టు ఎవరో తుడిచివేశారుట!

"కలా?"

తాయారమ్మ తూలుతూ వచ్చి అతని వళ్ళో వాలిపోయింది. వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

"ఎంత పిచ్చిదానవే? మొన్న అమరయ్య మామ జెప్పిన సంగతి అప్పుడే మరిచిపొయ్యావా? యివ్వాళ గాకుంటే రేపు దొరుకుతుంది పద్దు "

"నువ్వు యిల్లు కదిలితే గదా?"

"ఎందుకు కదలను? మన పాత షావుకారు లాభంలేదు. సత్యం పద్దు లిప్పిస్తానన్నాడు రెండు ఖాతాలు చూసుకొని రేపు పద్దు తెచ్చుకొందాంలే."

"ఈ గంజి తాగి తాగి రంగకు దగ్గుజూపింది. వింటున్నావుగా దాని గొంతు- ఖంగు ఖంగుమని."

కోటిలింగం మాట్లాడలేదు. మాట్లాడక తాయారమ్మ వీపు నిమిరాడు.

"నువ్వు గూడా మాట్లాడకపోతే నా గుండె పగులుతుంది. ఈ పిల్లల కళ్ళు నేను జూడలేను."

"ఛీ. ఏం మాటలు? రేపుండు."

* * *

సత్యం చిన్న ఖాతా ఒకటి చూపించాడు. దాని ఆసరాతో పదిసార్లు కొత్త షావుకారు చుట్టూ దిగిరి ఒక పద్నాలుగు రూపాయల పద్దు తెచ్చుకొన్నాడు కోటిలింగం. చెంగమ్మా, మాణిక్యం వచ్చి ఆకలి కడుపుల్తోనే పడుగులు చేసి పోశారు. చిల్లర పనులన్నీ తాయారమ్మే చేసింది. మగ్గం మీదినించి లేవకుండానే కోటిలింగం పనిజేశాడు గుడ్డిదీపంతో గునియకుండా మగ్గం ఆడించాడు. వారం రోజుల్లోనే ఆ పద్దు పని అయిపోయింది.

కొత్త షావుకారు భీమయ్య యింటికి ఆ రోజున అల్లుడొచ్చాడు. మంగలి తలంటిపోస్తున్నాడు. భీమయ్య బస్సుల్లో భాగం గూడా కలిశాడు. అపైన పసుపు వ్యాపారం జేస్తున్నాడు అన్ని పనుల్లో అతనికి తీరిక చిక్కక రేపు రమ్మని మాపు రమ్మని కోటిలింగాన్ని మూడుసార్లు తిప్పాడు. అప్పటికి పద్దులో మిగిల్చిన మూడు రూపాయలతో కొన్న కొత్త బియ్యం నిండుకొని రెండు దినాలు అయింది. రైతు సభల్లో పాటలు పాడి, ఖద్దరు చీరెలు కట్టి జిల్లాలకు జిల్లాలు తిరిగే భారతమ్మ అరుగిద్దల మానికతో కొలిచిన బియ్యానికా దయ - కూలి చేయించుకొన్న మానవులకు లేనప్పుడు?

మర్నాడు షావుకారు భీమయ్య చీరె తూకం తూచుకొని "రెండు తులాలు తక్కువ. అంచునూలు కాస్తా మింగేవా?" అని కళ్ళజోడుగుండా చూశాడు.

"నేనా మింగింది?"

"మరి నేనంటోయ్, కోటిలింగం? నీకు పద్దియ్యటమే బుద్ధితక్కువయిన పని. ఇచ్చినందుకు యెదురు నాకే పెడ్తున్నావ్ చివాట్లు? ఇదుగో, మూడు రూపాయలు తెగ్గోస్తాను. యిష్టముంటే తీసుకో-లేకపోతే పో. మళ్ళీ నీకు పద్దంటే పుట్టదు."

భీమయ్య అల్లుడు వక్కపొడి నములుతూ సిగరెట్టు కాల్చుకొంటూ బయటకు వచ్చాడు.

"ఈ పెద్దమనిషే- పిల్లా జెల్లా గలవాడని పద్దుల్లిస్తే యీయన జేసే పనిది. ఇక మనం యాపారం యేడిశినట్టే వుందిలే" అని భీమయ్య అల్లుడివేపు సానుభూతి కోసం చూశాడు. అల్లుడు సిగరెట్టు పొగవూది, పక్కపొడి ఉమ్మి వేశాడు

కోటిలింగం యిక అక్కడ ఒక్క క్షణం నిల్చోలేదు. గిరుక్కున మరలిపోయాడు. అతని పేరు రంగనాయకులు. ఈయన పేరు భీమయ్య. అంతే భేదం. ఈ జాతి జాతంతా ఒక్కటే.

# 6

ఈ మాటు సత్యం శ్రీరాములుగారితో కలిసి కలెక్టరు దగ్గరకెళ్ళాడు. ఎవరి పుణ్యమో మరి? బీద చేనేత పనివాళ్ళకు గంజి సత్రం వచ్చింది.

ఈ పల్లెల్లో కొత్త పాలకజాతి ఉద్భవించింది. పాత జమీందార్లుగాదు- మిల్లర్లు, కంట్రాక్టర్లు, బస్సు ఓనర్లు, లీడర్లు, పంచాయతీదార్లు. అన్ని అహం భావాలూ మూర్తీభవించిన అవకాశవాదుల పాలకజాతి యిది. ఏ హరిజనుల కాయకష్టంవల్లనో పండిన పంటల్ని పదింతల కమ్ముకొని, మిల్లర్లై, ముఠాదార్లై బుస్సరూట్లు, కొత్త హోటళ్ళు, పెద్ద పర్మిట్లు సంపాదించి, పరపతి సంఘాల పేరుతో స్వలాభం చూసుకొని, పొట్టలు పెంచుకొంటున్న కొత్త ఫాసిష్టు ముఠా యీ పాలకజాతి. చదివింది ఎంత మిడిమిడి ముక్కలైనా షెల్ కళ్ళజోడు ఫ్రేములతో, సిల్కు లాల్చీలతో, పేటంచు ఉత్తరీయాలతో త్రేన్చుతూ హోటళ్ళ చుట్టూ మూగి, బస్తీవాళ్ళ మనిపించుకోనేందుకు పరుగులిడుతున్న కొత్త పాలకజాతి యిది.

చేనేత పనివాళ్ళకు సహాయం చెయ్యమన్నప్పుడు - "పోవయ్యా, బాపనయ్యా - పనిలేని మంగలి పిల్లితల గొరిగాడన్నట్లుంది. ఆళ్ళ సంగతి నీకెందుకయ్యా, నీసంగతి నువ్వుజూసు కోక" అని శ్రీరాములుగార్ని తరిమి వేసింది యీ బలిసి కొవ్వెక్కిన ముఠాలే. రాజకీయ బాధితుడుగా ఆయన సంపాదించుకొన్న నాలుగెకరాల కొండకు - కులద్వేషాలతో అడ్డుతగిలి, పుట్టిన పట్టాను పొట్టబెట్టుకొన్న యీ ముఠావద్దకు శ్రీరాములుగారెందుకు వెళ్ళాడో అని సత్యం గూడా గినుసుకొన్నాడు.

కొత్త గంజిసత్రంలో ముసలివాండ్లకూ, పసిబిడ్డలకూ, గర్భిణీస్త్రీలకు మాత్రమే గంజి దొరుకుతుంది. శ్రీరాములుగారు పట్టుబట్టి కరణంగారి చేత తాయారమ్మను గర్భిణిగా నమోదు చేయించాడు.

గంజి సత్రం కమిటీలో షావుకారు కిష్టయ్యవంటి నాయకులు, భీమయ్య, రైతు మీటింగుల్లో ఖద్దరు చీరెలుగట్టి పాటలుపాడే భారతమ్మగూడా వున్నారు. రంగనాయకులు గంజిఫరసలో నిల్చొన్న తాయారమ్మను జూసి "నువ్వెందు కొచ్చావ్?" అని గద్దించి అడిగాడు. అతను కోటిలింగం యివ్వదేలిన బాకీమాట మరచిపోలేదు.

తాయారమ్మ కరణంగారి చీటి చూపించింది రంగనాయకులు ఆ చీటి తీసుకొని కిష్టయ్యతోను, భారతమ్మతోను సంప్రదించాడు. ఆ ఇద్దరు కలిసి కర్ణంగారిని పిలిచి అడిగారు. ఆరోజున తాయారమ్మ వట్టి గిన్నెతోనే యింటికి వచ్చింది. కోటిలింగం అరుగుమీద కూచొని ఆమెను చూడనట్లే నటించాడు.

గంజి సత్రం కమిటిలో శ్రీరాములు గారికి గాని, సత్యానికిగాని స్థానం దొరకలేదు. మీదు మిక్కిలి ఊళ్ళో దోపిడిగాళ్ళకు, భారతమ్మవంటి మోస గాళ్ళకు, ఓట్లలాలింపుగాళ్ళకు, కొత్తపాలకజాతి ముఠావాదుల కందరకూ అది కొత్త కార్ఖానా అయిపోయింది. కొత్తరూపాయల నోట్లకది కార్ఖానా.

సత్యం మొదట్లో నిగ్రహించుకొన్నాడు కాని భారతమ్మ దౌర్జన్యంతో షావుకారు ముఠా మోసాలు కలిసి కడుపుకాలుతున్నవాళ్ళనే దోచుకుతింటున్నవి. నిజమైన బాధితులూ, పేదలూ గంటలకు గంటలు సత్రంముందు పడిగాపులు గాచి పోతున్నారు. కాని, భారతమ్మ అరు గిద్దల మానిక సంగతి బయట పొక్కని వాళ్ళకు, మాష్టరు పీవర్లతో చేరి చేనేత సంఘాలకు ద్రోహం చేసినవాళ్ళకు, పొగిడి పొట్టనింపుకునే వాళ్ళకు గంజికేంద్రం ధర్మసత్రమైపోయింది. ఇక సత్యం ఆగలేదు. ఆ ఉదయమే, గంజిచేస్తామని కొలిచిన ధాన్యం దొంగదారులగుండా దొరల యిళ్ళు చేరకుండా కాపలా కాస్తానని నలుగురు కుర్రల్ని వెంటబెట్టుకొని వెళ్ళాడు.

ఆ రోజునే రామానుజయ్య తాత భద్రాద్రి ప్రయాణం పెట్టుకున్నాడు. ఆయనతో బాటు సత్యం తండ్రి అమరయ్యగూడా బయలుదేరాడు. అప్పటికి తాత పెట్టిన వారంరోజుల గడువూ దాటిపోయింది.

తాత బయలుదేరేముందు తన మఠంగదిలోని వస్తువులన్నీ కోటిలింగానికి అప్పగించాడు- ఉంచమని గాదు. బీదల కిమ్మని.

''అదేమిటి తాతా! నువ్వు తిరిగి రావా యేమిటి? కుండలూ గుళ్ళూ అందరికి యిస్తే నువ్వు వచ్చింతర్వాత నీ పనేమవుతుంది?'' అని కోటిలింగం ప్రశ్నించాడు.

''నీకు జెబితిని గదా? ఎవరి కవసరమో వాళ్ళకు పోతవి యీ సామాన్లు. నేను దాచినా నాకాడ నిలిచేది లేదు."

కోటిలింగాని కేమీ అర్థంగాలేదు ఆ సమాధానం.

''మళ్ళెప్పుడు తిరిగివచ్చేది తాతా? నవమి వెళ్ళంగనే వస్తావుగా?''

తాత తన తంబూరావంక జూసి ''సద్గురు కటాక్షం'' అని వూరుకొన్నాడు.

ఆనాడు చీకటిగదిలో, మాటల మధ్యలో రామానుజయ్య అకస్మాత్తుగా మౌనం దాల్చడం జ్ఞప్తికి రాగానే కోటిలింగానికి తిరిగి భయం ఆవహించింది.

''తాతా! నీమాటలు వింటుంటే తిరిగి వచ్చేట్లుగా లేవు. ఎన్నాళ్లుంటావో చెప్పవా?''

''నేను రాకపోతే, నువ్వయినా నాకాడకొస్తావుగా?'' అన్నాడు తాత.

కోటిలింగం తాతకళ్ళవంక చూశాడు. ఆ కళ్ళు తొణకలేదు. అతనికేమీ సమాధానం దొరకలేదు.

''ఎందుకు రాను ? నేనూ భద్రాద్రి వస్తా. నువ్వు రాకపోతే మర్నాడే బయలుదేరి వస్తా.''

ఇంతలోకే చిన్నమూటతో అమరయ్య వచ్చాడు. ఆ సంభాషణ ఆగిపోయింది. కాని, కోటిలింగం మనసు అస్థిమితమై, ఆందోళనాపూరితమైనది. అతనికేమి చేయటమో తోచలేదు. వాళ్ళు బస్సు దొరకలేదని స్టేషనుదాకా నడిచి రైలందుకోబోతున్నా మన్నారు. వాళ్ళతోపాటు కోటిలింగంగూడా రైలుస్టేషనుకు బయలుదేరాడు.

* * *

కాళ్ళీడ్చుకొంటూ పిచ్చి ఆకారంతో కోటిలింగం యిల్లుజేరాడు. అతను గడపలో కాలుబెట్టకముందే తాయారమ్మ వచ్చి "సత్యాన్ని పోలీసులు పట్టు కెళ్ళారు" అంది సగంఏడుస్తూ.

"సత్యాన్నా?"

"గంజికాడ గలాటా జరిగిందిట!"

కోటిలింగం కాళ్ళు వణికినవి. సత్యం! ఇతరుల కష్టాలు నవ్వుతూ భరించ గలిగినవాడు! అన్యాయాన్ని దహించివేయగల సత్యం !

అతని తండ్రి అమరయ్య యిప్పుడే భద్రాద్రిక్షేత్రం వెళ్ళాడు. ఏమీ తోచక పైకండువా నేలకు విసిరికొట్టి సత్యం యింటివేపు రివ్వున పరుగెత్తి పోయాడు. అక్కడ శ్రీరాములుగారు గూడా వున్నారు. అడంగులూ, పిల్లలూ లబోదిబో మంటున్నారు.

శ్రీరామునుగారు ముందుకువచ్చి "మనం బెయిలుకోసం వెతకాలి. ఎవరు దొరుకుతారో కొంచెం ఆలోచించు" అన్నాడు. సత్యానికి బెయిలు యివ్వ టానికి వందమంది వున్నారు. కాని, ఎవరు? మిల్లర్లు, కంట్రాక్టర్లు, మాష్టరు వీవర్లు, దోపిడిదార్లుగాదు. దమ్మిడీ ఆస్తిలేని కూలివర్గంవాళ్ళు; కడుపుగాలినా మగ్గంవదలని నేతగాళ్ళు; మాణిక్యం, చెన్నమ్మ, బిడ్డలకు తిండిబెట్టలేక నల్ల మందు నూనెతాగి చచ్చిన గురునాథం, మొగుడి కళ్ళముందే బావిలోపడ్డఓబులమ్మ- వందలొందలున్నారు. కాని, దమ్మిడీ నగదు చూపించలేని వీళ్ళ బెయిళ్ళు ఎవరిని నమ్మించగలవు?

శ్రీరామనవమి వెళ్ళిపోయింది. సత్యం జైలునుండి బయటకు రాలేదు. భారతమ్మను కొట్టిన కేసు రిజిష్టరయింది. భీమయ్య, రంగనాయకులు సాక్షులు. "సత్యం ఏ రెండేళ్ళకు బయటకు వచ్చినా వచ్చినట్టే!" అన్నాడు శ్రీరాములు గారు.

## 7

ఈ లోపల జైల్లో సత్యాన్ని చూట్టానికి శ్రీరాములుగారితో పాటు తనూ బయలుదేరాడు కోటిలింగం సత్యంవంటి కార్యవాది, కుర్రవాడు, ఉత్సాహి నాలుగు గోడలమధ్య కూచొనటం వూహించుకొంటే, జీవితంలోని వైపరీత్యం అర్థమయింటి కోటిలింగానికి.

"మా నాయన కేమీ గాబరాగా చెప్పవద్ద"ని సత్యం పదేపదే నొక్కి చెప్పాడు. అమరయ్య యింకా వస్తేనేగదా? వచ్చిం తర్వాత చెప్పక తప్పుతుందా?

సత్యాన్ని చూచిం తర్వాత తను మాట్లాడదలచుకొన్న మాటలన్నీ మర్చిపోయి, అతని మాసిన గడ్డంవంక కళ్ళప్పగించి పరికిస్తూ కోటిలింగం హృదయాంతరాళంనుండి వెలికిరాని వెతతో సంఘర్షిస్తున్నాడు. మాట్లాడిందంతా శ్రీరాములుగారే. ఆయన గూడా, మాట మాటలోనూ, పొల్లు పొల్లులోనూ నిరాశే వెదజల్లుతున్నట్లు దిగులుగా, దిక్కుతోచని మాటలు మాట్లాడాడు. ఆయన కష్టసుఖాల లోతులు చూచినవాడు గావటంచేత మొదటినుంచీ సాక్ష్యంకోసం తగు ప్రయత్నాలు చేస్తున్నాడు. కాని సాక్ష్యమా దొరికేది?

"ఎవళ్ళకు వాళ్ళు భయపడుతున్నారు. ఈ కరువు కాలంలో ఎవళ్ళ నోటి ముందు కూడు ఎవళ్ళు పోగొట్టుకుంటా రంటావ్? చివరికి మనతో తిరిగే వెంకటప్పడు గూడా భీమయ్యను చూసి, రంగయ్యను చూసి బెదిరిపోతున్నాడు. సత్యం... ! నాకెప్పుడూ, ఎన్నడూలేని నిరాశ వేస్తున్నది. కాలం మారిపోయింది సత్యం! డబ్బు ముందు నీతి రాజ్యం చెయ్యలేకుండావుంది." అవును, కోటిలింగం గూడా అనుకొన్నాడు. ఇదంతా కాలజ్ఞానంలో చెప్పలేదా? కలికాలం యొక్క నిజస్వరూప మిది. ధర్మచక్రానికి బూజుపట్టిపోయింది. న్యాయదేవత నాలుక తెగిపోయింది. ఆమె కాళ్ళు విరిగిపోయినవి.

సత్యం, ఒక్కసారి ఆ యిద్దరివంకా చూసి - "శ్రీరాములుగారూ! మీకు మేమంతా ఋణపడివున్నాం. అది తీర్చుకొనేమాట వట్టిది, కాని, నేను జైల్లో వుంటమే మంచిదంటాను. మన వాళ్ళకు బుద్ధి వస్తుంది. నేను కనబడకపోతేనే వాళ్ళలో ఐకమత్యం కుదురుతుంది. నన్ను గురించిన ప్రయత్నాలిక మానటం మంచిది. ఆ గొర్రెమందలో దాగిన పులుల్ని మీరు ఒక కంట కనిపెట్టి వుండండి. మన వాళ్ళకు సలహాలిస్తూ వుండండి" అన్నాడు. సత్యం నివారిందామని ఎంత ప్రయత్నం చేసినా అతని కంఠం గద్గదికంగానే వినిపించింది.

శ్రీరాములుగారు ఒక్కసారిగా పెదిమ విరిచాడు.

"ఇంకా యింత పిచ్చిలో పడుతున్నావు సత్యం! ఐకమత్యమంటున్నావు. ఇంకేం సంఘం? గంజిముంత ముందు అన్నీ కూలిపోయినాయి. మానవుల ఆత్మతత్వమే మారిపోయింది. భార్యతో అబద్ధమాడి భర్త గంజి తాగేస్తున్నాడు. పిల్లల

నుండి దాచి తల్లి గంజి మాయం జేస్తున్నది. ఆకాశం విరిగిపడ్డమే తరవాయి సత్యం! మానవత్వం తన ఆఖరి దశలోవున్నదంటే నమ్ము. అంతదాకా ఎందుకు? వీళ్ళందరికోసం ఆ దుర్మార్గులతో కయ్యం తెచ్చుకున్నావుగదా? ఇప్పుడు నీకు వ్యతిరిక్తంగా ముంతెడు గంజికోసం నిన్ను జైలుపాలు చెయ్యటానికి సిద్ధంగా వున్నారు నీ వాళ్ళు!'' శ్రీరాములుగారు ఏ సమయంలోనైనా యింతటి కడుపు దరిగే మాటలు మాట్లాడగా వాళ్ళిద్దరూ వినలేదు. దూరపు ఆశలతో, నిత్యోత్సాహియై బ్రదికిన ఆ శ్రీరాములుగారేనా యీయన? తన దారిద్ర్యాన్ని దాచుకొని, ధర్మాన్ని, గాంధీని నమ్ముతున్న శ్రీరాములుగారేనా యీయన?

సత్యం ఆయనకు నమస్కరించాడు.

''పోనీండి, మానవత్వమంతా యింకి పోనీండి.''

అంతటితో యిక ఆపమన్నాడు, అక్కడ నిలుచున్న పోలీసు.

"ఏమోనోయ్ సత్యం! నాకు జీవితమంటే అసహ్యం కలుగుతున్నది. మా అమ్మగారు కాటికి కాళ్ళుజాచి కూర్చున్నది. ఇవ్వాళో రేపో అంటున్నది. నీతో ఎప్పుడైనా చెప్పానా - ఆమెకు తిండీ తిప్పలూ, మందు మాకు అందటం లేదని?"

సత్యం కళ్ళనిండా నీరు కమ్మింది. కోటిలింగం నిశ్చేష్టుడై ఆ మాటలు విన్నాడు. దేశభక్తుడు! బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని యెదిరించిన ఆనాటి దేశభక్తుడు! మాతృదేశానికి తన యౌవనకాలాన్ని సమర్పించిన రాజకీయ బాధితుడు! తన జీవితంలో మూడవభాగం కారాగారాల్లోనే గడిపిన కర్మయోగి - శ్రీరాములుగారు!

''మాకు చెప్పదగిన పెద్దలు, మీరు గూడా వెనుకంజవేస్తే యింకేముంది? పోనీండి. ఈ లోకం, యీ దానవ సమాజం అంతా నాశనం కానీండి. మీరు కిందటిసారి నాకిచ్చిన పుస్తకం రెండుసార్లు చదివాను. ఈ దుఃఖాన్నుండి కొత్త సమాజం, కొత్త మానవులూ పుడతారని వ్రాశాడు. అదే నిజం. అదే తథ్యం. శ్రీరాములుగారికి తిండి పెట్టలేని లోకం ఏం లోకం?'' సత్యం బిగువుగా, కంఠమంతా వుబుకుతూ, ఏకధాటిగా ఆ మాటలన్నాడు. సత్యంలో కళ్ళెంవేసిన ఆ కోపాన్ని యిదివరకు కోటిలింగం గూడా చూడలేదు.

ఇక పోలీసు వచ్చి సత్యాన్ని లోపలకు నెట్టాడు. వెళ్ళేటప్పుడు, కోటి లింగం వుత్తరీయంతాకి - "యింటిదగ్గర జాగ్రత్తగా చూసుకుంటూండు బావా!" అని మరలాడు. బయటకు మళ్ళినప్పుడు, కోటిలింగానికి దారి కనపడలేదు. "ఈ లోకాన్ని నేనెరగను. నేను గుడ్డివాణ్ణి. నాకు తెలియని సంగతులన్నీ అంత విపులంగా సత్యం, శ్రీరాములుగారు మాట్లాడుకొన్నారు. నేను మానవుల్ని తెలుసుకోలేదు. నేను గుడ్డివాణ్ణి'' అనుకొన్నాడు. దారిలో పిరికిగా శ్రీరాములు గారిని స్పృశించబోయినాడు. శ్రీరాములుగారు వెనకకు చూచి ''పిచ్చివాడా!'' అని అతని వీపు తట్టాడు.

*　　*　　*

ఇంటికి వెళ్ళగానే మొదట అమరయ్య మామ భద్రాద్రినుంచి రామాను జయ్య తాతతోపాటు తిరిగి వచ్చాడేమోనని చూడబోయాడు. కాని, రాలేదు. అక్కడనుండి రామానుజయ్య తాత మఠం గదికి వెళ్ళి, తను బొడ్లో భద్రంగా దాచుకొన్న తాళం చెవితో తలుపు తెరిచి లోపల కాలుబెట్టాడు. అంతా దుమ్ముగా వున్నది. ఒకమూల తాత తంబురా, ఇంకోమూల పాతకుండ ఒకటి మాత్రమే ఆ గదిలో యింకా మిగిలివున్న వస్తువులు. కోటిలింగాని కెందుకో భయం వేసింది. తాతయీ మధ్య అన్న మాటలు అతి రహస్య గర్భితమైనవని తిరిగి తోచింది. పోనీ, శ్రీరాములుగారిని అడుగుదామా? అని తలపోశాడు. కాని, ధైర్యం చాలలేదు. ఏమని అడగటం అసలు? తనకు ఒక్కమాట గూడా పెగిలిరాదు. రామాను జయ్య తాత తిరిగివస్తాడా? ఎందుకు రాడు? మరి అతని వీడ్కోలుమాట లేమిటి?

కోటిలింగానికి ఆ గదిలో ఒంటరితనం భరించలేనిదయింది. గోడమీద బల్లి, వేళ్ళాడే సాలీడు, తంబురా, కుండ, పగిలి కిందపడిన మట్టిప్రమిదె తన అంత రాత్మలో దూరి తనను, తన మనస్సును, తన భవిష్యత్తును పరీక్షిస్తున్నట్లుగా తోచింది. ఎందుకు తోచింది? అతనికి రామానుజయ్య వస్తువుల్ని తాకి కళ్ళ కద్దుకోవాలని అంతరాంతరాలనుండి వెల్లువై ఉద్వేగం వచ్చింది. అతను వణికి పోయాడు. వణుకుతూన్న చేతులతోనే తంబూరా కదలించాడు. దానికింద రామా నుజయ్య తనకెన్నోసార్లు చదివి వినిపించిన "కాలజ్ఞాన గ్రంథం" వున్నది. కళ్ళ కద్దుకొన్నాడు. తంబూరా పైకెత్తబోయినాడు. కాని, అది ఆ అస్థిర హస్తాలలో నిలవలేదు. భూపతనమై పదిముక్కలైపోయింది. కోటిలింగం హఠాత్తుగా పెద్ద

కేకవేసి ఆ గదినుండి బయటకు పరుగెత్తాడు కాళ్ళు, హృదయం, తల విఘడియనుండి విఘడియకు ఉధృతమైన వేగంతో చలించి కదిలిపోతున్నవని గ్రహించాడు. తలుపుకు తిరిగి తాళం గూడా వేయకుండానే యింటికి ఎట్లాగో చేరాడు.

"ఎందుకట్టా వణికిపోతున్నావ్?" అంది తాయారమ్మ.

కోటిలింగం ఆమె కళ్ళల్లోకి సూటిగా చూసి, "నాకు కొంచెం గంజివుంటే పొయ్యి" అని మాత్రం అనగలిగాడు.

# 8

అర్ధరాత్రివేళ వరండాలో పడుకొన్న తాయారమ్మ- యింట్లో పెద్ద శబ్దం విని లేచింది. వరండాలో కోటిలింగం లేడు. లోపల గుడ్డి కిరసనాయలు బుడ్డి వెలుగుతున్నది. తాయారమ్మకు భయంవేసి కేక వేయబోయింది కాని, పిల్లలు లేచి ఏడుస్తారేమోనని చటుక్కున ధైర్యం తెచ్చుకొని, దగ్గరగా వేసివున్న తలుపులు తెరుచుకొని లోపలకు అడుగుపెట్టింది.

శబ్దం చేస్తున్నది కోటిలింగమే. అతను మగ్గంగుంటలో కూచునివున్నాడు. గట్టుమీద దీపం వున్నది. అతని చేతిలో కట్టెలు చీల్చే పెద్ద మొద్దుకత్తి వున్నది. మగ్గాన్నంతా వూడదీసి, ఏ కొయ్యకాకొయ్యను క్రమక్రమంగా, నీటుగా కత్తితో పగలగొట్టుతున్నాడు. స్వేదంతో అతని వళ్లంతా తడిసిపోయింది. తలగూడా చన్నీళ్ళ స్నానం చేసివచ్చినట్లుగా వుంది. వంటిమీద అంగవస్త్రం ముక్కటే వున్నది. ఈ దృశ్యం చూడగానే మొదట నిశ్చేష్టురాలైనది. ఒకవేళ కోటిలింగం పిచ్చివాడు కాలేదుగదా అని భయంకరమైన యోచన వచ్చిందామెకు.

కోటిలింగం ఆమెవంక కన్నెత్తి గూడా చూడలేదు. అతని చూపు, మనస్సు అంతా-ఆ విధ్వంసక క్రియలో లగ్నమైవున్నట్లు తోచినది. తాయారమ్మ భయాందోళనలు కోపజ్వాలలై రగుల్కొన్నవి.

"నీకేం పోగాలం వచ్చింది? పిల్లల నోటి ముందు తిండి తీస్తున్నావ్!" అని పెద్దగా అరిచింది.

కోటిలింగం తల పైకెత్తి ఆమెవంక నిదానంగా చూసి "నీకు తెలీదు గామాలు. తాత తంబురా పగిలిపోయింది. ఈ మగ్గంతో నాకు పనిలేదింక" అని బహు నెమ్మదిగా సమాధానం చెప్పాడు.

తాయారమ్మ రెచ్చిపోయింది.

"నీకు మతిపోయింది. మమ్మల్ని చంపి పారేయక పొయ్యావా గొంతులు పిసికి? ఈ అఘాయిత్యం చేయమని ఎవరు చెప్పారు నీకు? ఆ ముసలి బైరాగి ముండాకొడుకుతో తిరిగి, కొంప - గోడు మర్చి, యింటికి చేటుదెస్తావా?''

అప్పటికే మగ్గం నామరూపాలు లేకుండా పోయింది. అతను మాట్లాడకుండా మొద్దుకత్తిని ఆ శిథిలాలమీద పారేసి అపర శివుడు లయనృత్య వేదిక నుండి తొలగినట్లు తొలగిపోయాడు వరండాలోకి. ఆ గొడవకు పిల్లలంతా లేచి గొల్లుమన్నారు. తాయారు పసికందుల్ని దగ్గరకు చేర్చుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

* * *

కోటిలింగం మొట్టమొదటిసారిగా వ్యవసాయ కూలీ అయినాడు. అతని ఆ జీవితంలో, ఉయ్యేల లూగించిన చెయ్యి శ్మశానవాటికలో గోరీలు త్రవ్వ బోయింది. పూలుబెంచిన హస్తాలతో గులకరాళ్ళనెత్తాలి అనుకొంటూనే మొదటి సారి జనుముకోతల కెళ్ళాడు ఈ కాయకష్టంలో నీచత్వం వున్నదని అతనికి మొదటినుంచీ తోచింది. తన తోడివాళ్ళతో తనెందుకు కలియలేదో అతనికే తెలియదు. మగ్గం నాశనం చేసిననాటినుండీ అతను యితరుల జోక్యమే మాను కొన్నాడు. మానవులంటేనే అతని శరీరం ముడుచుకొనేది. ఒక్క శ్రీరాములు గారు తప్ప తాయారమ్మనూ, తన బిడ్డలన్నా గూడా అతనికా అసహ్యభావమే స్ఫురిస్తున్నది.

చేతులు తెగుతూ, నాలిక పీకుతూ, శిరస్సు మండుతూ - వేడెక్కిన కొడవలితో; కింద మేకులవంటి మోళ్ళు కాళ్ళకు గుచ్చుకొంటూండగా జనుము కొయ్యటం తేలికపనిగాదనీ; దీనికి సుళువు తెలియాలనీ, తెలివి ఉండాలనీ, యీ కష్టం ఎంత తక్కువదైనదని తను అనుకొన్నా దాని సుళువు బలువులు ఎరగాలనీ అతను గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు. తనతోడి కూలీలంతా పది బారల ముందుండగా తనింకా వెనుకనే తచ్చాడుతూ, బొబ్బలు పొక్కిన చేతులతో కొడవలి మార్చుకుంటూ, గట్టుమీద కూర్చుని చుట్టకాల్చుతున్న రాయుడమ్మ రైతుచేత క్షణక్షణం చీవాట్లు తింటున్నాడు కోటిలింగం. రైతు సుల్తాన్ "తేరగా కబుర్లు జెప్పటమనుకొంటివిటోయ్ సాలాయనా? నడుం వంచు.

అడ్డెడుగింజలు వృత్తిపుణ్యానికిరావు. అంత వళ్లగందేవాడివి కూలి కెందుకొచ్చా? బట్టలు నేసుకోపోయినా?" అని రెట్టిస్తూనే చుట్ట కాల్చివేశాడు. పక్కన నోరులేని బ్రాహ్మల పొలాలగట్లు గదుముకొని, అడ్డం వచ్చిన మాలపకిరుమీద దొంగకేసు బనాయించి జైల్లో తోసి, మునసబును కూడగట్టుకొని మొత్తానికి ఆ పొలమంతా పొగాకు పొర ధరకు తను కట్టుకొని రాయుడమ్మ ఆ గట్టుమీదినించి ఈ గట్టు దాకా దృష్టి సారించి తృప్తిపొంది వూరుకోలేదు. చుట్టపీక అవల పారేసి, చేలోకి దూకి, కోటిలింగం చేతిలో కొడవలి లంకించుకొని, అతన్ని మెడమీద చెయ్యివేసి గెంటి ''వట్టి ముదనష్టం బాపతు. పో, పో! నీకు మద్దెనాల తిండి టోయటం గూడా శుద్ధ దండగైంది: ఎవర్రా అంకా, వీడ్ని బిలుచుకొచ్చింది?" అని తన జీతగాడిమీద తిరిగినాడు.

కోటిలింగం ధాన్యపు సుల్తాన్‌తో కలియబడబోయినాడు. మిగతా కూలీలు అడ్డువచ్చి అతన్ని మెల్లగా పంపివేశారు. 100 నెంబరు నేసిన హస్తాలు! పాప్లయిన్లు చూసి తిరిగి మగ్గం నేసిన హస్తాలు! వంకర పూజల చిలక జరీగళ్ల చీరెలు మురిపెంగా తన యింటి నుండి అమ్మకం చేసిన హస్తాలు! ఆ హస్తాలు దేనికి యీ నవాబుకు? ఆ హస్తాలు విరిగిపోయినాయ్. ఆ మగ్గమూ మాయమైనది.

## 9

శోభనాచలం కూతురు సావిత్రిని సత్యానికిచ్చి పెళ్ళిచేద్దామన్న నిశ్చయం ఏనాడో జరిగింది. కాని సత్యం పట్టుదల వల్లనే ఆ మంచి ''ఘడియ నెట్టుకు రాలేదు.'' సంఘాల్లో, మీటింగుల్లో, ఆకలియాత్రల్లో అతని కాలమంతా లెక్కకు రావటంలేదు. అన్నింటినీ మించిన పెద్ద అభ్యంతరంగూడా సత్యం పుట్టించిందే. ''పూలదండలు మార్చుకోటమే మా పెళ్ళి. అందుకు పెద్దలు వప్పుకొన్నదాకా మేమూ భీష్మించుకు కూర్చుంటాం'' అని సత్యం పట్టుబట్టాడు. ఇటు శోభనా చలం, అటు అమరయ్య యీ హఠాత్ విప్లవానికి తయారుగా లేరు. కాలం మారిందని, డబ్బు విలువ తలక్రిందులైందని వాళ్ళకు తెలియకగాదు. కరవు దేవత గ్రామదేవతకు బదులు సావిడిలో కాపలా కాచి కాపురం చేస్తున్నా, శక్తికి మించిన బరువు భరించిన తరతరాలనాటి ఆచారాలకు, ఇంతటి అపవాదునుగూడా భరించలేక సమాజానికి అడుగడుగునా భయపడే మనస్తత్వానికి, పూర్వులు గీచిన గడిలో గృహకార్యాలు జరిగించకపోతే దేవతలకు కోపం వస్తుందన్న పాప

భీతికి దాసులైన పెద్దలు సత్యం పట్టుదలకు లొంగిరాలేదు. "ఉడుకురక్తం" "పిల్లవేశం" అన్నారు. సావిత్రి కలలు కలలుగానే నిలిచిపోయినవి.

మంచం వాల్చుకుని కోటిలింగం చీకట్లో పడుకొనివున్నాడు. గృహ జీవితంతో అతనికి పూర్తిగా సంబంధం తెగిపోయినట్లే వ్యవహరిస్తున్నాడు. వ్యవసాయ కూలిపని అనుభవమైన రోజునుండీ ఇంట్లో తిండి గింజలు లేవన్న సంగతి, తాయారమ్మ ఉపవాసాలతో సగమై కళ్ళల్లో ప్రాణం నిలుపుకొన్న సంగతి, బిడ్డల్ని పోషించలేక మామగారింటికి పంపాడని తనవాళ్ళు తనను గూర్చి అన్న సానుభూతి వాక్యాలసంగతి - వీటన్నింటికీ అతను అతీతుడైపోయి నట్లున్నాడు. నిజానికి తన మామ అంత హఠాత్తుగా ఎందుకు వచ్చాడో అతనికి తెలియదు. వచ్చి "పిల్లల్ని నాతో పంపు. ఈ నాలుగు నెల్లూ అక్కడే వుంటార్లే" అన్నాడు. కోటిలింగంతనకు పట్టనట్లు వూరుకొన్నాడు. తాయారమ్మే పిల్లల్నిం దర్నీ ప్రయణం చేయించి, తండ్రితో అంపించేసింది. చివరకు కోటిలింగం సమ్మతినీ గూడా అడగలేదు.

చీకటో అత నేమాలోచిస్తున్నాడో అతనికే తెలియదు. తనే అనిత్యమనో? లేక కొండలవలె, సముద్రాలవలె ఈ చీకటీ, మానవుడి అకలీ, చుట్టూ వ్యాపించి వున్న విషాదం, విషవాతావరణం నిత్యమైనవనో? ఇంట్లో తాయారమ్మ ఏమి చేస్తున్నదో గూడా అతను కనుక్కోలేదు. తన భార్య అనే వ్యక్తి అస్తిత్వాన్ని గూడా అతను స్మృతికి తెచ్చుకోప్రయత్నించుకోలేదు.

చీకట్లో, నెమ్మదిగా వచ్చిన సావిత్రి ముఖంమీద కప్పుకొన్న పమిటె చెంగు తొలగించుకొని తన కెదురుగా నిలబడి "అన్నా!" అని పిలిచింది. ఆ పిలుపుతో అతను లోకంలోకి మరలివచ్చాడు. ''అంతేనా? ఇందరూ వుండి బావకు జైలు గతేనా? ఏం తప్పు జేశాడని? తన కోసంగాదుగా ఏం జేసినా? ఎవరికి వాళ్ళు తప్పుకుపోతే నాగతేంగాను?''

సావిత్రిమాటలు హృదయంలోనికి చొచ్చుకుపోయినవి. యుగయుగాలుగా మహాప్రళయాలలోగూడా అచంచలమై నిలిచిన మహా మేరువు, దీనులైన ప్రజలు విడిచిపోయిన పసిగందువు ఆర్తనాదానికి ఒక్కసారి కరిగి, ప్రవహించినట్లు అయింది. కోటిలింగం దిగ్గున మంచం దిగినాడు. సావిత్రి ముఖంవంక తేరిపార జూచినాడు. ఇంట్లోగాని, బయటగాని, మగ్గం గుంట దగ్గరగాని దీపం లేదు. చీకట్లో మిణుగురు పురుగులవలె అతని కళ్ళు ఆ దీనురాలివంక జూచినవి.

"సాక్షులు దొరికితే దావకేసు పోతుందని శ్రీరాములుగారంటున్నారు. నువ్వొక సాక్షివి. నేనొకదాన్ని."

ఈ సంగతి తన కింతవరకూ తట్టలేదు. సావిత్రి చీకట్లో పెదవులు వణుకుతూ మాట్లాడింది. ఈ మాటు అమెవంక చూడలేకపోయాడు.

"ఇకపోతే ప్లీడర్ని పెట్టాలిట. ఒక యాభై దొరికితే రెండు మూడు వాయిదాల దాకా ఏమీ పరవాలేదని శ్రీరాములుగారు చెప్పారు" అని సావిత్రి ముగించింది.

భక్త రామదాసు ప్రార్థన విని తానీషా బాకీ చెల్లించిన రామలక్ష్మణులు అతనికి మనోగోచరమైనారు. చీకట్లో సావిత్రి నిలిచివుంది తన జవాబుకోసం.

ఆమె కదలికలేని చెక్కడపు బొమ్మవలె తిరిగి మాట్లాడలేదు. ఆమెలో రామానుజయ్య కనిపించాడు. ఆనాటి రామానుజయ్య మౌనానికి తనముందు దేవతవలె నిలిచి కర్తవ్యప్రబోధం చేస్తున్న సావిత్రి మౌనానికి సారూప్యం గోచరించింది. మరుక్షణంలో అతన్ని ఆనాటి భయం ఆవేశించింది. గజగజ వణికిపోయి, తూలి మంచంలో కూలబడ్డాడు.

"అ....న్నా....!" అని ముందుకు వంగి, సావిత్రి పెద్దగా అరిచింది. ఆ అరుపుకు యింట్లో తారయారమ్మ పరుగెత్తుకువచ్చి "మీ అన్నకు వంట్లోనూ, మనసులోనూ బాగుంటంలేదులే" అని సావిత్రి మీద చెయ్యివేసింది.

* * *

పూనికవచ్చి పరమాత్మని దర్శనంలో లీనమైన భక్తునివలె కోటిలింగం ఒక గంటవరకూ మంచంలోనే పడివున్నాడు. కలలో, ఎవరో దేవత, ఏవో దూరలోకాలనుండి మేఘమాలికలమీద పయనించి వచ్చి తనకు జీవిత సందేశాన్నందించి, కనుతెరిచినంతలోనే మాయమైపోయింది. కన్నీళ్ళు కార్చక, అధైర్య పడక, అబలగాక తన ముందు నిలిచి, జ్ఞానోపదేశంజేసినది - తన కళ్ళముందు పెరిగి పరికిణీ కట్టి, సిగ్గుతో సత్యాన్ని క్రీగంట జూచి శోభనాచలం యింట్లోకి పరుగెత్తే చిన్న సావిత్రేనా? ఈ సావిత్రిని తనెప్పుడూ చూడలేదు.

కమ్మరికొలిమిలో కాలికాలి, ఆ ఉష్ణోగ్రతలో గూడా తన సహజశక్తిని కోల్పోని ఉక్కుకడ్డీవలె ఛట్టున మంచంమీదినించి లేచి నిలబడ్డాడు. ఇందాక వచ్చిన భయాందోళనలు, బలహీనతకు బదులు, అపూర్వశక్తితో అతని మెదడు

పనిజేయసాగింది. సత్యం జైలునుంచి బయటకు రావాలి! ప్లీడరుకు యాభై రూపాలు కావాలి!!

ఎక్కడున్నై యాభై రూపాయలు? సత్యాన్ని జైల్లో పెట్టించిన భారతమ్మ ఇంట్లో లేవా?

రాత్రి పన్నెండు దాటినది. వరండాలోనుండి కనబడే శ్మశానంలో కొరివి దయ్యాల నృత్యం ప్రారంభమయింది. స్వార్థలోకంలో వేదాంతి హితవచనాలవలె, నిశీధిని చీల్చుతూ ఊరకుక్కలు వ్యర్థంగా మొరుగుతున్నవి. కోటిలింగం బయటకు వచ్చి నాలుగడుగులు వేసి, ఏదో మరిచిపోయినట్లు తిరిగి యింట్లోకి వెళ్ళి చేతులారా నాశనం చేసిన మగ్గంగుంటమీది మొద్దుకత్తి తీసుకొని బొడ్లో దోపుకొని, పైన పాత పంచె కప్పుకొని బయలుదేరాడు. అడుగులో అడుగు వేసుకొంటూ, ప్రపంచంలో హంతకుల మార్గం బహు సులభమైనట్లుగా దిక్కులు గూడా చూడకుండా, హుటాహుటిని నడకసాగించాడు.

లోకంతోపాటు శ్రీరాములుగారి యిల్లుగూడా, పాత హిందూసామ్రాజ్యాల రాజధానిలో శిధిలంవలె, కుప్పగా, ముద్దగా, చీకట్లో ఆకారంలేక నిద్రిస్తున్నది. అతని కాళ్ళు చటుక్కున ఆగినవి ద్వారం సందులగుండా మిణుకుమిణుకుమని గుడ్డికాంతి కన్పిస్తున్నది. "శ్రీరాములుగారూ!" అని పిలువబోయినంతగా అతని పెదిమలు ప్రయత్నించినవి.

శ్రీరాములుగారి ఇంటిదగ్గర మలుపు తిరిగింతర్వాత ఎవరో యిద్దరు మనుషులు చుట్టలు కాల్చుకుంటూ అతని కెదురొచ్చారు. అందులో ఒకడు "ఎవరా పోయేది?" అని గట్టిగా అడిగాడు. కోటిలింగం బదులుచెప్పక ముందుకు సాగాడు. రెండో మనిషి దగ్గిరసా వచ్చి చూచి "నువ్వటయ్యా కోటిలింగం? పిలిస్తే పలకవేం?" అని తేల్చిపారేసి రెండో వాడితో కలిసి వెళ్ళిపోయాడు. అక్కడే కోటిలింగం కత్తి కిందకు జారిపడ్డది. తిరిగి తీసుకొని, యిక ఆలోచన లేకుండా కోటిలింగం కళ్ళుతెరిచి చూచినాడు. తాను భారతమ్మ యింటిముందు నిల్చొని వున్నాడు ఎంతలో?

భారతమ్మకు భర్తలేడు. కాని, కొద్దో గొప్పో ఆస్తి వున్నది. ఆమెను కని పెట్టుకొన్న ఒక ముసలమ్మా ఆమే వున్నారు - ఆ కొంపలో. ఈ ఇల్లు కొత్తగా కట్టించింది భారతమ్మ - చిన్న బంగళాలాగా. కోటిలింగం ఒక క్షణం నిల్చి

ఆలోచించి, గోడదూకి లోపల కాలుబెట్టాడు. చుట్టూ తిరిగి లైటువస్తూన్న కిటికీ ముందుకెళ్ళి, తను కనబడకుండా వంగి మెల్లగా సందులలో నుండి తొంగి చూచాడు.

ఒక రెప్పపాటు కోటిలింగం తన కళ్ళను తాను నమ్మలేకపోయాడు. తిరిగి జాగ్రత్తగా కళ్ళు నులుముకొని చూశాడు. ఆ గదిలో భారతమ్మ ఒక్కతే గాదు వున్నది- ఆమెతోబాటు సుబ్బారావుగూడా వున్నాడు! ఆ ఊరి శృంగార పురుషుడు సుబ్బారావు. భారతమ్మ తమలపాకులు చిల్చి అతని నోట్లో కుక్కుతున్నది. కోటిలింగానికేమిచేయాలో తోచలేదు. సభల్లో, రచ్చల్లో పెత్తందారుగా, సంఘసేవకురాలుగా చలామణీ అవుతున్న భారతమ్మ రహస్యజీవనం అతని కళ్ళముందున్న దాక్షణంలో- పొట్ట విచ్చుకొని నేలగూలిన మేడిపండు వలె!

జుగుప్సతో అతనా కిటికీనుండి కదిలాడు. వెనుకకు మరలాడు, కాని, సావిత్రి ముందువచ్చి నిలిచినట్లయినది. పిరికితనమనుకొన్నాడు. లలాటంమీద కమ్మిన స్వేదం తుడుచుకొని తిరిగి ముందుకొచ్చాడు. అతనికి పిచ్చి ఆవేశం వచ్చింది. పోయి గబగబా తలుపు గుద్దాడు.

సుబ్బారావును చూడగానే అతని వళ్ళు జలదరించింది. సంఘంలో యీ బలాదూర్ వ్యక్తికే ఘనతా, ప్రాధాన్యం లేదు. అప్పటికే రెండు మూడు యిళ్ళు కూల్చాడు. చదువు సంధ్యలు నడమంత్రంగానే ఆగిపోయినవి. కారు డ్రైవర్లతోనూ, చీట్లపేక ఆటే ప్రధానంగా పెట్టుకొని జీవితాన్ని గడిపే పచ్చి బడుద్దాయిలతోనూ కాలక్షేపం చేసి, రౌడీజుట్టు పెంచుకొని, చేతిలో సిగిరెట్టు టిన్నూ, గూడకట్టూ, సిల్కు కళ్ళీల లాల్చీతో తిరిగే యీ బేవార్సును యిది వరలో తనెప్పుడూ కన్నెత్తి గూడా చూడలేదు.

మలాన్ రంగుజాతి అసూయతను ద్వేషించే భారతీయ విజ్ఞానులు తమ స్వగ్రామాలవంక ఒకసారి చూసుకోవాలి. సుబ్బారావు అర్పినయిళ్ళన్నీ మైనారిటీ కులాలకు చెందినవి. సుబ్బారావుది మెజారిటీకులం. వూళ్ళో అతనిమీద అసహ్యం వున్నా, అది ఆచరణలేని సిద్ధాంతం మాత్రమే అయింది.

కోటిలింగానికి ఆపాదమస్తకమూ ఒక అగ్ని ప్రసరించింది. సత్యంవంటి ఉత్తమ మానవుడు నాలుగు గోడలమధ్య మగ్గుతూండగా, యీ పెత్తందారీ

కొత్త భాగ్యవంతులు పట్టించుకోలేదు. కాని, యీ మిల్లర్లు, దేశవాళీనాటు పెట్టుబడి వర్లెవాటుదార్లను స్వేచ్ఛగా వదిలివేశారు. ద్వేషంతో, క్రోధంతో కోటిలింగం తూలిపోయాడు. ఈ పాపాలే ఏ తక్కువ బలంగలకులంవాళ్ళు చేస్తేనో? బుర్రమీసాలు తిప్పుకొని, ధనంతో మదించి, చుట్టలు మార్చినట్లుగా పార్టీలను, నాయకులను మార్చి, పర్మిట్లకోసం ఎగబడే దౌర్జన్యపూరితులైన ఈ పెత్తం దార్లందరూ తమ కుళ్ళూ, ద్వేషాలూ మరిచిపోయి ఏకంగారా? అవుతారు. ఎన్ని సార్లు తనీ ఘోర నిరంకుశాన్ని దివరలో చూడలేదు? ఇంకెన్ని సార్లు చూడ నున్నాడు?

"భారతమ్మా! భారతమ్మా!!"

లోపలి అదరిపాటు, దొడ్డితలుపు తెరుచుకొని తిరిగి మూసుకొనటం, ఆ తరవాత తొట్రుపాటు, ఆ పిమ్మట "ఎవరు?" అన్న ప్రశ్న కోటిలింగం విన్నాడు. మండిపోయి-

"నేను!" అని కాలిపోతూ పెద్దస్వరంతో జవాబిచ్చేడు. అంత పెద్దగొంతు ఆవశ్యకత లేనేలేదు.

"నేనంటే ఎవరు? అర్ధరాత్రివేళ పేరైనా చెప్పకుండా?"

విద్వేషాగ్ని మరొకసారి ప్రజ్వరిల్లింది. ఆ శిఖలనుండి అతని తప్త స్వరం భయంకరంగా వినవచ్చింది.

"కోటిలింగం - కోటిలింగం!"

మరొక క్షణంలో ముసలమ్మ లాంతరు చేతబట్టుకువచ్చి తలుపు తీసింది. ఆమె వెనకనే భారతమ్మ వుంది. విస్ఫులింగాలవంటి కళ్ళతో, ఆ కులటను కాల్చేటట్లు పది క్షణాలు కోటిలింగం తదేకదీక్షతో చూచినాడు. ముసలమ్మ నోరు చేసుకోబోతుండగా అతనే అన్నాడు కోపంతో వణికిపోతూ - "సుబ్బారావేడి?"

భారతమ్మ దిగాలుపడ్డది. ఆ తెల్ల చీరె మల్లెపూల సింగారంనుండి నెత్తురు చుక్క లేని ముఖం ఆందోళనతో అతనివంక చూచింది. ఇక తన మర్యాద దక్కదనుకొన్నదేమో, ముసలమ్మను వెళ్ళి పడుకోమని పంపించేసింది. అప్పటికి సంబాళించుకొని, అమాయకత్వం తెచ్చుకొని "ఏ సుబ్బారావు?" అన్నది.

''ఏ సుబ్బారావో ఎందుకుంటాడిక్కడ? నీ సుబ్బారావు. నీవు తమల పాకులు నోట కుక్కావే- వాడు నేను తలుపు తట్టగానే దొడ్డిదోవ చూపించిన సుబ్బారావు. మాట్లాడవేం?....''

ముసలమ్మ యీ కరుకు సంభాషణ విని తిరిగి వచ్చింది. కోటిలింగం తడుముకోకుండా బొడ్లోనుండి మొండి కత్తి తీసి ముసలమ్మవంక చూశాడు. భారతమ్మకు నోటమాటరాక వెనకకు ఒక అడుగేసింది. వేసి ముసలమ్మను తిరిగి లోపలికి తోసివచ్చి దూరంగా నుంచొన్నది. తిరిగి కోటిలింగం పళ్ళు కొరుకుతూ, ద్వేషం పలికిస్తూ మాట్లాడాడు:

''మోసకత్తెవు, కులటవు. సత్యంవుంటే గంజి కేంద్రంలో నీ ఆటలు సాగవని జైల్లో తొక్కించావు. నీ బదుకు ఒక్క క్షణంలో రచ్చపాలు చేయ గలను. రేపటి మాపుకు నీ పేరు నలుగురి నోట్లో నానుతుంది. నీ జీవానికి బడి యేడుస్తున్నది యింకో ఆడపిల్ల. సత్యం జైల్లోనుంచి బయటకు రాకపోవాలి- నీ బదుకు బయలుచేస్తాను. జాగర్త! పళ్ళుదెలిసి మసులుకో. నాకు ప్రాణంమీద ఆశ లేదు. సత్యం కోసం నీ రక్తం యేరుచేస్తా....తెలిసి మసులు.''

భారతమ్మ వణికిపోయింది. ఒకవంక గౌరవం; మరొకవంక తన ప్రాణం....కళ్ళ నీళ్ళు తిరిగినాయి. ఆ పరిస్థితుల్లో స్త్రీ ఏమి చేయాలో అదే చేసింది. కోటిలింగం తను వచ్చిన పని మరిచి ద్వేషపు సుడిగుండంలో చుట్లుచుట్టుకు పోతున్నాడు.

భారతమ్మకు ఒక క్షణం వ్యవధి దొరికింది. తన గదిలోకి పోయి తిరిగి వచ్చి, కోటిలింగం చేతుల్లో యిన్ని నోట్లు పోస్తూ ''అయిదు వందలు. నా మర్యాద కాపాడు. నీ తోబుట్టినదాన్ననుకో కోట్లింగం! సత్యంమీద నేను సాక్ష్యం చెప్పను. కేసుకు ఎంతయితే అంత ఖర్చు నేనిస్తాను. ఈ సంగతి మరిచిపో. ఇంకో ప్రాణికి పొక్కనివ్వద్దు. యివి చేతులు గావు. నీ తోడబుట్టినదాన్ని....'' అని వలవలా ఏడ్చింది.

కోటిలింగం నోట్లు తీసుకొన్నాడు. ఒక్క క్షణం వాటివంక చూశాడు. అతనికి లెక్కపెట్టాలన్న బుద్ధి గూడా పుట్టింది. మరుక్షణంలో, గుప్పిట బిగించి నోట్లు నలిపి, ఆవేశపూరితుడై భారతమ్మ ముఖాన విసిరికొట్టి "అయిదు వందలు - హూ! ఎవరిని కొనదలచుకొన్నావ్, నీ అయిదు వందలతో- నన్నా?

సత్యాన్నా?" అన్నాడు. అతని కళ్ళనిండా నీరు నిలిచింది. ప్రళయంలో ఝంఝూమారుతానికి గూడా చలించని చెట్టువలె అతడు నిలబడ్డాడు. అతని దేహంలోని గ్రంధులన్నీ విద్వేష రసాన్ని స్రవించినట్లుగా అతని ముఖం కోపోద్రేకంతో వరుసగా ఎర్రనై - నల్లనైనది. అతని కళ్ళముందు రామానుజయ్య, శ్రీరాములుగారు, సత్యం నిలిచి వున్నారు.

కోటిలింగం మరి మాటాడక విసవిసా నడిచి వెళ్ళిపోయాడు. భారతమ్మ నిశ్చేష్టురాలైనది. తెల్లవారుఝాము కోళ్ళు కూసినవి.

# 10

కోటిలింగం ఇల్లు చేరేటప్పటికి మసక చీకట్లో అతని రాకకై తాయారమ్మ ఎదురుచూస్తున్నది.

''ఎక్కడికి వెళ్ళావో యేమో? శ్రీరాములుగారు మనిషిని పంపించారు నీ కోసం" అన్నది.

కోటిలింగం బొడ్లో పెద్ద కత్తి తీసి ఆమెవంక ప్రశాంతవదనంతో ఒక్క క్షణం కళ్ళు నిలిపాడు. భారతమ్మ యింటినుండి తిరిగివచ్చేటప్పుడు తను శ్రీరాములుగారి యిల్లు తప్పించివచ్చాడు. తను రాత్రి చేయబోయిన నీచకార్యాన్ని దూరదృష్టితో తెలుసుకొని, తనకు మరొకసారి దివ్యజ్ఞానాన్ని ప్రసాదించేందుకేమో శ్రీరాములుగారి యీ పిలుపు? లేక, సత్యం కేసు వాయిదా రేపేగదా? దానికోసం శ్రీరాములుగారు పిలువనంపుతున్నారో? లేక తనకు కర్తవ్యం ప్రబోధించిన సావిత్రి శ్రీరాములుగారిని గూడా వేడుకొన్నదేమో? లేక, స్వరాజ్యపోరాటంలో వీరుడననీ, రామరాజ్యానికి వారసుడనీ తిరిగి తన స్మృతికి తెచ్చేందుకు యిది పిలుపేమో? రాత్రి విషయం పూరంతా అప్పుడే గుప్పుమన్నదా? అయితే కానీ, ఈ లోకమంతా ఒక్కటై వచ్చినా, తను నిలువగలడు. అవకాశవాదులు, మిల్లర్లు, కుట్రవాదులు, మదాంధులైన భూస్వాములు, చీకటిబజారు వ్యాపారులు, రౌడీలు, దోపిడిముఠాలు- వీరే లోకమైనప్పుడు తనూ, రామానుజయ్య, శ్రీరాములుగారూ సత్యం దేవతలైపోగలరు - ఆ దైత్యలోకంముందు.

కోటిలింగం తన కళ్ళతో లోకాన్నంతా తృణప్రాయంగా చూచి, శ్రీరాములుగారింటికి బయలుదేరాడు.

శ్రీరాములుగారి తల్లి శుష్కించిన దేహం ప్రేతంవలె కళలేక దావుకు నిరీక్షిస్తూ ఆముదపు దీపం వెలుగులో కనబడ్డది. ఆమె కుక్కిమంచం పక్కనే శ్రీరాములుగారు ఒక పాత పెట్టెమీద కూర్చొని ఆమెకు ప్రాణమైన గీతా పారాయణం చేస్తున్నారు. ఆగది చుట్టూ కలియజూచాడు కోటిలింగం. పైనుండి నల్లని బూజు తుట్టెలు తుట్టెలుగా, దారిద్ర్యపిశాచి జడలవలె వ్రేలాడుతున్నది. చిలుము బట్టిన ఒక ఇత్తడి గ్లాసూ, దానిప్రక్కన మూతివిరిగిన ఒక పాత కూజా, పేడ అచ్చులు వూడిన పాటి మట్టిగోడకు ఒక దణ్ణెం, దానిమీద ఒక్కటే పాతగుడ్డ. మంచంమీద నున్న శ్రీరాములుగారి వైపు చూచాడు ఒకటికి రెండుసార్లు. ఆ గదిలో మృత్యుదేవత గోడలై, యింటికప్పె తానుగా నలుముఖాలకు తన విషపు నవ్వును వ్యాపింపచేసి దాగి వున్నది. మృత్యుదేవతకు ఒక ఆకారం కల్పించి ఆ వంకకు తిరిగాడు కోటిలింగం. శ్రీరాములుగారు శ్లోకాలు చదువుతూనే వున్నారు—"యదా యదాహి ధర్మస్య, గ్లానిర్భవతి భారత! అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్, పరిత్రాణాయ సాధూనాం....వినాశాయ చదుష్కృతామ్ ......."

మంచంలో వృద్ధురాలు యివి వింటున్నదో లేదో కోటిలింగానికి తెలియ లేదు. ఆ గదినిండా విషాదం గాలిగా మారి స్తంభించివున్నది.

కోటిలింగం వచ్చిన తర్వాత శ్రీరాములుగారు ఒకసారి తలెత్తిచూసినా అతన్ని పలకరించలేదు. కోటిలింగం ఆయన సరసనే కూచొని, తల్లి బతికి వుండగా మంచి తిండీ మందులుపెట్టి సుఖింపజేయలేకపోయినా ఆమె అవసాన దశలో గీతాపారాయణంతో ఋణవిముక్తి చేసుకొంటున్న ఆ దేశభక్తుడిలో లీనమై పోయినాడు. చిత్రంగా కోటిలింగానికి గూడా మృత్యువుమీదే ఆలోచనలు పోలేదు. మృత్యువు తరవాత ఏమిటి? రామానుజయ్య కాలజ్ఞానం చదివి చెప్పిన ముక్కలు స్మృతికి వచ్చినవి గాని, వాటిని వెంటనే మరిచిపో ప్రయత్నించాడు. తన బిడ్డల మీద మమత మళ్లింది. రామానుజయ్య, అమరయ్య రామనవమి గడిచిపోయి పక్షంరోజులైనా యింకా తిరిగి రాలేదేమా అన్న ఆందోళన గలిగినది. తను సావిత్రికి ఏమని సమాధానం చెప్పాలి? రాత్రి భారతమ్మ డబ్బు తిరస్కరించి, సత్యాన్ని తను అన్యాయం చెయ్యటం లేదా? ఈ పరిస్థితిలో శ్రీరాములుగారి సలహా తనేమి పొందగలడు?

హఠాత్తుగా శ్రీరాములుగారి పఠనం ఆగిపోయింది. ఇనుమడించిన దిగులుతో కోటిలింగం తిరిగి మృత్యుదేవత సన్నిధికి వచ్చిపడ్డాడు.

"మహాతల్లి తన కష్టాలు విరగడచేసుకొని దాటిపోయింది. ఒక్కసారి రామనామం ఉచ్చరించు, కింద బెట్టుదాం."

ఆ వృద్ధురాలి మృత్యువులోగూడా ఏదో అపనమ్మకమున్నట్లు, శ్రీరాములు గారి మాటల్ని విశ్వసించలేక అతను మంచం మీదికి వంగిచూశాడు. మరుక్షణం అయన వంకకు తిరిగి లేచి నిల్చున్నాడు. ఇద్దరూ కలిసి శవాన్ని కటిక నేల మీదకు దించి ముఖాలు చూచుకొన్నారు. దహనసంస్కారాల పని చూడాలి. శవంమీద కప్పటానికి గజం కొత్తగుడ్డ గూడా లేదు. కోటిలింగం గడ్డం కింద చెయ్యిపెట్టుకు నిల్చుండిపోయాడు. మొన్నటికన్నా పదేళ్ళు ముసలివాడై, అసహాయుడై - చనిపోయిన తల్లికి చెట్టంత పుత్రుడైన ఈ నిర్మల దేశభక్తుడు శ్రీరాములుగారి ముఖంవంక అతను దృష్టి నిలుపలేకపోయాడు. అప్పటికప్పుడే తెల్లవారి బారెడు పొద్దెక్కినది.

"నేను పోయి తక్కిన పనులు చూస్తాను" అని కోటిలింగం ఆ మృత్యు గుహాంతరాళం నుండి వెలికివచ్చాడు. రాత్రల్లా అతనికి నిద్రలేమిచేత తూలుతూ యిల్లు జేరాడు. తాయారమ్మ చేతులమీద తన పెళ్ళినాటి పెద్దాపురం పట్టుజరీ ఉత్తరీయం నలగకుండా మడిచి వేసుకొని ఎక్కడకో ప్రయాణానికి సిద్ధంగా నిలబడివుంది. కోటిలింగం ఆమెకు ఎదురుగానిల్చుని రొప్పుతూ తన ఎర్రనికళ్ళు కిందికి వాల్చి "ఎక్కడికి" అని అడిగాడు.

"ఎక్కడికున్నది? నువ్వు తెచ్చే సంపాదనకు యిక నేను యిల్లు గదల నక్కర్లేదుగా! జంగం దర్జీకి యిదన్నా కుదవబెట్టకపోతే నీకు ముంతెడు గంజి గూడా దొరకదు రాత్రికి."

సిగ్గుతో అతని ముఖం కందిపోయినది. కాని, తాయారమ్మ కళ్లు తన కళ్లను ఎదుర్కొన్నప్పుడు అతని ధైర్యమూ, కోపమూ పటాపంచలైపోయినవి. కోటిలింగం ఆమెను సమీపించి చేతులు చాచినాడు. ఆమెచేతులు అప్రయత్నంగా వణికినవి. పట్టుత్తరీయం జారి కిందబడ్డది. అతను క్షణం తటాపటాయించి వంగి, ఉత్తరీయం తీసి చంకబెట్టుకొని తిరిగి క్షణంలో అదృశ్యమైపోయాడు.

* * *

బ్రదికివుండగా చినుగులేని గుడ్డ కట్టకపోయినా, కన్నీరుగూడా రాని కట్టె అయిన తర్వాత ముసలమ్మ ఒక పెద్దాపురం జరీఅంచు పట్టుబట్ట కప్పుకొన్నది. శ్రీరాములుగారి తోటికులంవాళ్ళెవరూ సాయంరాలేదు. ఊళ్ళో హరికథల తీర్థులూ, ముసలీ పితంతువులను పొగిడి పొట్టనింపుకునే రాఘవ దీక్షితులూ - యీయన నెప్పుడో వెలివేశారు. ''అప్పుడు కులంలేదన్నాడుగా! మాలనని చెప్పుకొన్నాడుగా! మరి మాలవాళ్ళ చేతనే తల్లిని పారేయించమనవోయ్!'' అని శ్రీరాములుగారి జ్ఞాతులు కోటిలింగానికి ఉచిత సలహానిచ్చారు. చివరకు కొమ్ములుబట్టి పాడెను మోసింది - ''రామదాసు'' బుచ్చిచౌదరీ, కోటిలింగమూ. శ్రీరాములుగారు నిప్పుకుండ బట్టుకొని ముందు నడిచాడు. చివరకు మంత్రపుష్పం చదివే బ్రాహ్మడుగూడా కరువైనాడు.

శవదహనం, కపాలమోక్షం అయ్యేసరికి తిరిగి అస్తమయమైంది. ఆరోజున రామదాసు బుచ్చయ్యకుగానీ, కోటిలింగానికి గానీ, మాతృహీనుడు శ్రీరాములు గారికి గానీ తిండిలేదు. శ్మశానంనుండి తిరిగివస్తూ శ్రీరాములుగారు బుచ్చయ్య వంక చూసి వెర్రిగా నవ్వసాగాడు. కోటిలింగం వంకకు తిరిగి మళ్ళీ మరింత పెద్దగా నవ్వాడు. వీధుల్లో వున్న జనం - ''పాపం, పిచ్చెక్కిపోతుందేమో!'' అని పెదిమలు చప్పరించటం కోటిలింగం గగుర్పాటుతో విన్నాడు. బుచ్చయ్య అతి కష్టంమీద ఆయన్ను పట్టుకొని యింటికి నడిపించాడు.

కోటిలింగం దీపాలుబెట్టే వేళకు యిల్లు చేరేసరికి ఎదురుగా సావిత్రి కూర్చొనివుంది.

"శ్రీరాములుగారికి పిచ్చెక్కిందని పుకారుగా వుంది; రేపు వాయిదాకు ఎవరు పోతారన్నా?''

కోటిలింగం నిర్విణ్ణుడైపోయి సావిత్రి వంక చూశాడు. అతనామెకు సమాధానం చెప్పలేక మెట్టుమీద కుప్పగా కూలిపోయాడు.

# 11

కోటిలింగానికి జ్వరం మొదటి మూడు దినాలూ యినప కొలిమివలె మండిపోయింది. అతను కలవరింతల్తో, పిచ్చిమాటల్తో, తిండిలేక శుష్కించి శల్యమైపోయాడు. ఈ మూడు రోజుల్లోనూ సావిత్రి మాత్రం రెండుసార్లు పలకరించటానికి వచ్చింది.

నాలుగవ రోజున కోటిలింగం కొంచెం కళ్ళు తెరిచి తన చుట్టూ చూచుకో గలిగాడు. తల బరువుగా, దిమ్ముగా వుంది. కళ్ళు తెలికై నీళ్ళు కార్చేశక్తి గూడా లేక వెలుగు నెదుర్కొనలేక పోయినవి. ఈ మూడు దినాలు అతనిది వేరే ప్రపంచం. ఆ ప్రపంచంలో నిర్మలమైన వెలుగు, సన్నని సెలయేళ్ళు, వద్చికబయళ్ళు, ఆడంబరంలేని గోపురాలతో గుళ్ళూ, నిశ్శబ్దము. మళ్ళీ కళ్ళు తెరిచి యీ లోకాన్ని దర్శించవలసి వచ్చినప్పుడు చైతన్యంకల దేహానికి, మొద్దు బారిన మనస్సుకీ అమితమైన బాధ కలిగింది మళ్ళీ కళ్ళు మూనుకొన్నాడు. కాని, తాయారమ్మ వచ్చి పక్కనే కూర్చుని మెడకింద చేతులుబెట్టి పైకి లేవనెత్తి, నోటిముందు జావగిన్నె అందిచ్చి, బలవంతాన పాతచింత కాయపచ్చడి నాలికకు రాచింది. కోటిలింగం భళ్ళున కక్కి, పెద్ద వాంతి చేసుకొని, తిరిగి అలిసిపోయి నిద్రించాడు.

ఆ రాత్రి తగ్గిన జ్వరం తిరిగి ఫెళ్ళున వచ్చింది. కలవరింతలు గూడా వచ్చినవి. ఈసారి అతని దేహానికి చైతన్యం పోయింది. మనోక్షేత్రం మాత్రం వున్నది. ఒకసారి అతను సావిత్రి గొంతును గుర్తించాడు.

"భారతమ్మ సాక్ష్యం చెప్పలేదట ఒంట్లో బాగుండలేదని కోర్టుకే పోలేదని తెలిసింది. నీ సాక్ష్యం లేకపోతే యింకేం కేసు - అని పోలీసులన్నారట. బావకు విడుదలవుతుందనే మనవాళ్ళంతా అంటున్నారు."

ఆ మాటకు కోటిలింగం మాగన్నుగా కళ్ళు విప్పి చూశాడు. సావిత్రి కొంచెం పెద్దగా "బావ సంగతి. జైల్లోనుంచి వదిలేస్తా రంటున్నారు. పుకారేలే. నిజం సంగతి ఎవ్వరికీ తెలీదులే'' అని అతనివంక చూసి అన్నది. తను మృత్యు సన్నిధిలో వున్నట్లు, తననా జీవ సమాధినుండి మేల్కొలువ వద్దన్నట్లు తిరిగి అతడు సుషుప్తిలో పడిపోయాడు.

మరికొంచెం సేపటికి తిరిగి రామదాసు బుచ్చి చౌదరి గొంతుక విని అతనికి మెళకువ వచ్చింది. కాని, కళ్ళు తెరవకనే పడుకొన్నాడు. "రామదాసు" పేరు బుచ్చయ్యకు బిరుదు. భక్త రామదాసు జైల్లో పాడిన కీర్తనలన్నీ బుచ్చయ్యకు కంఠతావచ్చు. రామదాసు వేదాంతం భక్తివేదాంతం; రామానుజయ్య రహస్య వాదంగాదు. కాని, మెళ్ళో రుద్రాక్షలు, పై పంచె కింద కప్పి, ఊళ్ళో బీదలకు, ఉత్తములకు మాటతోడుగా వుంటాడు డాంబికంలేని బుచ్చయ్య. శ్రీరాములు

గారి సేవానిరతిని ఉప్పు సత్యాగ్రహం రోజుల నుండి గుర్తించి పూజించినవాడు బుచ్చయ్య. అతని ఆస్తి సంతర్పణలకు, భజన పార్టీలకు, సక్కుబాయి పాండురంగడి కీరపండరీ భజనసమాజాలకూ; కాషాయగుడ్డలూ, భజనచెక్కలు, గజ్జెలు, హార్మోనియంపెట్టెలు కొనియివ్వటానికి ఏయేటికాయేడు తరిగిపోతూవుంది.

బుచ్చయ్యగొంతు యీమాట సుస్పష్టంగా వినిపించింది. "ఇంకేం శ్రీరాములుగార్లే. ఆ మర్నాడే అయిపులేకుండా పోయాడు. ఒకటే నవ్వు. పిచ్చి నవ్వు. విపరీతం గాకపోతే యేమిటి చెప్పు తాయారమ్మా! ఇది ఊరా, అడివా? ఊరికి ఒక్కగా నొక్కడు జైలుకు బోయొచ్చి నాయన. దేశంకోసం పొయ్యాడంటావా లేదా? ఆయన గతేమన్నా గనుక్కున్నారూ? ఇప్పుడూ అంతా అయిపోయి, ఆయనకి పిచ్చెక్కి దేశాలమీద బోయింతర్వాత, నాలికలు గరవటానికి ఊరంతా మొనగాళ్ళే. బెజవాడలో టేషన్‌కాడ గుడ్డలు జింపుకొని తిరుగుతున్నాడంట మొన్న. మా లచ్చయ్యను బంపి తీసుకురమ్మన్నాగా.... అహ మడిసి మన లోకంలో వుంటేనా? ఏ లారీకిందనో బడతాడు....

''అంతటితో ఆ జీవి అయిపోయింది. ఆ యిల్లు సంగతడిగావ్? దెయ్యాలూ, భూతాలూ తిరుగుతున్నై. వెనక బోలెడంత దొడ్డి. కుక్కలూ పందులూ దొర్లాడుతున్నై. అంతా మనవాళ్ళే. కాన్దెవర్లే! అయనకు చెరువుకిందపల్లంలో మూడెకరాలొచ్చేటప్పటికి సావుకార్లకూ, పెత్తందార్లకూ కన్ను గుట్టిందాయెను. అ౦- పిశాచై బడతాళ్ళే. ఈ ఊరికి మంచిగ్గాదులే వచ్చింది. రెండు ప్రాణాలు - ఏం మాటలా - రెండు ప్రాణాలు? ఈళ్ళ జీవానికి బడియేడ్చి - యీళ్ళ బిడ్డల్ని గూడా బట్టుకుంటుందిలే యీ పాపం! చేసింది వూరికేటోద్దా?''

అర్ధరాత్రివరకూ మళ్ళీ రోగికి మెళకువ రాలేదు. అర్ధరాత్రికి నాలిక పిడచగట్టుకుబోతుంటే బలహీనంగా కళ్ళు తెఱిచి చూశాడు. అక్కడ తాయారమ్మకనబడలేదు. మామూలుగా వెలిగే గుడ్డిదీపం గూడా లేదు. తెల్లవారుఝాము దాకా కోటిలింగానికి కంటిమీద కునుకు రాలేదు. విపరీతమైన దాహంతో నాలిక పీక్కుపోయింది. గోడపట్టుకుని లేచి మెల్లగా పడమటి గదిలోకిపోయి తడుముకొని కుండతాకి నాలుగు గుక్కలునీళ్ళుతాగి తిరిగివచ్చి పడ్డాడు.

తొలికోడి కూసిన వేళకు తలుపు తెఱచుకొనివచ్చిన తాయారమ్మను స్పష్టంగా చూచినాడుగాని పలకరించే ఓపిక వున్నా పలకరించక కళ్ళు మూసుకొనేందుకే ప్రయత్నించాడు.

తాయారమ్మ తలలో తెల్లమల్లెపూలున్నవి. మంచి తాంబూలపు సువాసన కొట్టింది.

* * *

తిరిగి కోటిలింగానికి మెళకువ వచ్చేసరికి వుదయం తొమ్మిది గంటల యింది. అతని నాడి పరీక్షిస్తూ నంబి నరసింహాచార్లు అపర విష్ణువవలె ముక్కాలి పీటమీద కూర్చొనివున్నాడు. పడమటింటి గడపలో తాయారమ్మ నిల్చుని వున్నది. వాళ్ళిద్దరి చూపులు కలుసుకొననే లేదు.

"సన్నిపాతంకింద బెడుతుందని మొదట్లో అనుమానించానుగాని నాడిలో ఉష్ణదోషం మాత్రమే కనబడుతున్నది. వట్టి విషజ్వరం! ఈ మాత్రలూ, తిఫల కషాయం రెండు పూటలూ తీసుకోవాలి. నాలుగు రోజుల్లో తగ్గిపోదూ? కాచిన నీళ్ళు ఎన్నైనా తాగొచ్చు. వేయించిన బియ్యంతో జావగాచి యియ్యొచ్చు'' అని చెప్పి ఆచార్లుగారు వెళ్ళిపోయారు.

తాయారమ్మ పక్కమీద మాత్రలూ, కషాయం గిన్నే వుంచి వెళి పోయింది. ఇద్దరూ మాట్లాడుకోలేదు. కళ్ళతో చూసుకోనుగూడాలేదు. ఆ రోజు వరకూ ఇంట్లో వంట లేదు. కాని ఆ రోజున తాయారమ్మ విరిగిన మగ్గం పుల్లలు మండించి వంట చేసింది. ఆమె నటు బోనిచ్చి, మాత్రలూ కషాయమూ ఆవల పోరబోసితూలుతూ వచ్చి కుక్కిమంచంలో పడ్డాడు కోటిలింగం.

ఆచార్లుగారు చెప్పినట్లే నాలుగు రోజులకుగాని జ్వరం తగ్గలేదు కోటిలింగానికి. అతని శరీరం కృశించినా ఒడలంతా పచ్చబడ్డది. కళ్ళు కొత్తకాంతితో ఆ లోతునుండే వెలుగుతున్నవి. అతడు పూర్తిగా మౌనధారి అయిపోయినాడు.

ఆ సాయంత్రమల్లా అతను రామానుజయ్య పాతబూజుగదిలో గడిపాడు అక్కడ విరిగిన తంబూరావంకనే చూచి చూచి గంటలు గడిపాడు. తరవాత వాటిని అతికించే ప్రయత్నం చేశాడు. బాగా చీకటిపడ్డ తర్వాత కాలజ్ఞాన గ్రంథం తాటాకు పత్రాలు ఒళ్ళో వుంచుకొని, అర్థనిమీలిత నేత్రాలతో చాలా సేపు కదలక మెదలక ధ్యానముద్రలో కూర్చుండిపోయాడు. అతను ఏ ప్రార్థనలూ చేయలేదు. చివరకు మనసులో ఏ విషయాన్నిగురించిగూడా ఆలోచన చెయ్యలేదు. అనాటికతను యింటిముఖం చూచి రోజుపైనే గడిచినది.

రాత్రి పదకొండు దాయల అతను రామానుజయ్య గదికి తాళం వేసి, శ్రీరాములుగారి శిథిల గృహావరణలో అడుగు బెట్టినాడు. అతని కాళ్ళకింద ఎండుటాకులు నలిగి శబ్దం చేసినవి. లోపలగూడా అంతా చీకటిమయం. గబ్బిలాలు అంతలోనే అక్కడ నివాస మేర్పరచుకొన్నవి.

కోటిలింగం తలుపు వద్దకు వెళ్ళి తట్టిచూచాడు. బయట తాళం లేదు. కాని, లోపల గడియ వేసినట్లుగా వుంది. అతనికి ఆశ జనించింది. శ్రీరాములుగారిని చూచి ఒక సంవత్సరమైనట్లున్న దతనికి. బహుశా పిచ్చికుదిరి, మనస్థిమితంతో శ్రీరాములుగారు తిరిగి వచ్చారేమోనని అతనికి తోచింది. తలుపు గట్టిగా తోశాడు. కాని, రాలేదు. సందుగుండా తిరిగి దొడ్డిదోవన వెళ్ళి వెనక తలుపుగుండా లోపలికి పిలుద్దామని సందుమలుపు తిరిగాడు. వడి వడిగా ఒక మనిషి తప్పుకొని, తప్పుకొని, తలమీద గుడ్డకప్పుకొని గోడమీదనుండి అవలీలగా దూకి పారిపోతున్నాడు. కోటిలింగం భయాతురుడు కాలేదు. ఆ మనిషి నతడు సులభంగా గుర్తుపట్టాడు. అతను ఆ రోజు రాత్రి భారతమ్మ యింట్లో కన్పించిన సుబ్బారావు!

కోటిలింగం వెనుదిరిగి వీధివాకిలి వేపుకు వచ్చాడు. తిరిగి అతని కాళ్ళ కింద ఎండుటాకులు మోగినవి. ఈసారి ఒక క్షణం క్రిందట మూసుకొనివున్న బయటి తలుపు తెరిచివున్నది. అతడు గబగబా బజారులోకి వచ్చి తొంగి చూచాడు. దూరంగా చీకట్లో ఒదిగి ఒదిగి నడుస్తున్న తాయారమ్మను గుర్తుపట్టాడు

## 12

కోటిలింగం తెల్లవారుఝామున, వణుకుతూ చలిలో ఇల్లుజేరాడు. అతనికి గడపలోనే తాయారమ్మ వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం వినిపించింది. చుట్టూ నిశ్శబ్దాన్ని చీల్చుకొని ఆ శబ్దతరంగాలు తన కొరకే పయనించి వచ్చినట్లతనికి తోచింది.

తాయారమ్మ గడపమీద తల అనించి పమిటచెఱగు కప్పుకొని పడుకొని వున్నది. కోటిలింగం రాకతో ఆమె ఏడుపు మానింది. అతడు మెల్లగా, తూలుతూ వెళ్ళి ఆమె భుజం తాకాడు. వేడిగా కాలుతున్న అతని వేళ్లు ఆ భుజాన్ని మండించినవి. ఆమె కళ్ళు పెద్దవి చేసుకొని అతని కళ్ళవంక చూచింది.

ఆ చీకట్లో గూడా కోటిలింగానికి యింట్లో ఆ మూల చిన్న రాశిగా పోసివున్న బియ్యం కన్పించినవి. వాటిని ఆమెకు తన వేలు చాపి చూపించినాడు.

"నీవు అన్నపూర్ణవు'' అన్నాడు మెల్లగా.

తాయారు అతని కళ్ళను తిరిగి పరికించింది. ఆ కళ్ళు చింతనిప్పులవలె మండిపోతున్నవి. కాని, ఆ నేత్రాల్లో క్రోధం లేదు. శాంతిదేవత వుట్టిపడుతున్నట్లున్నవి. అంతరంగిక మానసిక సంఘర్షణలో అవి జ్యోతులయినవి.

"నీవు నా తల్లివి. నేను నీకిం కెంత మాత్రమూ భర్తను కాను. నాకే గాదు - ఈ లోకానికే తల్లివి. నా ఆకలి తీర్చేందుకు నీ ధర్మం వదలుకొని మాతృధర్మం వహించావు. నీకు నమస్కరించటానికి వచ్చాను. నాకు కోపం లేదు తాయారూ! నీకు గాదు తాయారూ, యీ నమస్కారం - నీలోవున్న జననికి; నీలోని మానవత్వానికి; నీలోని నా తల్లికి.''

అతడు వంగి ఆమె పాదాలు స్పృశించాడు. ఆమె పాదాలను పైకి లాక్కొనబోయింది. ఆమెలో శక్తి నశించి వాటికి చలనం కలగలేదు. ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. గడపమీద తల బాదుకొన్నది. అతడు వారించి "అన్నపూర్ణ దుఃఖమంటే ఎరుగదు'' అని ఆమె తలను మృదువుగా నిమిరినాడు.

ఆమె ఏడుపు నాపుకొని "అమరయ్య బాబాయి తిరిగి వచ్చాడు.'' అన్నది.

''అవును, కాని, రామానుజయ్య తాత తిరిగి రాలేదుగా?''

''ఇంకెక్కడి తాత? తాతను అడవిలో చిరత పులులు తినేసినయ్యని బాబాయి చెప్పినాడు.''

అతను మౌనంగా ఆమె మాటలు విన్నాడు. ఆ తరవాత ఆమె గూడా ఏడ్వలేదు. ఒక దీర్ఘమైన నిట్టూర్పు మాత్రమే వినవచ్చింది. ఆమె పాదాలు తాకుతూ అతడు నిద్రించాడు.

* * *

బ్రహ్మయోగం నుండి లేచినట్లుగా తెల్లవారిన తర్వాత తన యింటి ముందు చెలరేగుతున్న బ్రహ్మాండమైన కోలాహలానికి కోటిలింగం నిద్రమేల్కొన్నాడు. అతన్ని లేపుతూ సత్యం కనిపించాడు, సత్యం జైలునుంచి అరాత్రే

విడుదలలై వచ్చాడు. అతని మీద కేసుపోయింది. ఆ రాత్రి అమరయ్య రామానుజయ్య తాత దుర్మరణ వార్త తెచ్చిన రాత్రి.

కోటిలింగం కళ్ళు నులుముకొని లేచి కూర్చున్నాడు. ఎదురుగా ఎంతో మంది జనం. వాళ్ళల్లో భారతమ్మ గూడా కన్పించిది. అందరిముందూ నిల్చున్న అమరయ్యనే అతడు చూడలేదు.

వెనకనుంచే మాటలు వినవస్తున్నవి:

"చెఱువులో దూకింది — చెఱువులో...."

అప్పటి కతని కర్థమైనది, అమరయ్య వళ్ళో తడిగుడ్డలతో వుబ్బిన తాయారమ్మ శవం అతనికి గోచరించింది. అతను నెమ్మదిగా లేచి ఆమె పాదాల వద్ద తన తలనుంచి తిరిగి లేచి నిలబడ్డాడు. అందరూ ఒక్క క్షణం మౌనం వహించారు అతనికి దారి యిచ్చారు.

అతను సత్యంవంకకు తిరిగి మెల్లగా అన్నాడు:

"నాకు పిలుపు వచ్చింది. నేను రామానుజయ్య తాతను వెదుక బోతున్నాను. నువ్వు వచ్చావు. నా తల్లిని మర్యాదలతో నీవే సాగనంపు."

అతని కళ్ళవెంట నీళ్ళులేవు. అతని చేతులు వణకనూ లేదు. సత్యం అతనివంక బిక్కముఖంతో చూచాడు. రామదాసు ముందుకువచ్చి సాగిపోతున్న అతని కాళ్ళకు నమస్కరించాడు. అతను వెనుదిరిగి చూడలేదు. *

(ఆంధ్రపత్రిక - సచిత్ర వారపత్రిక - 30-12-53)